www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 170 | బుధవారం 12.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

# మెట్రో రద్దీకి చెక్!

## అదనపు బోగీలపై రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



**డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్..**

- పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి: సీఎం రేవంత్ రెడ్డి
- ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై సీఎం కీలక ఆదేశాలు
- 7.5 కి.మీ రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచన
- పాతబస్తీ మెట్రో కారిడార్‌కు టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశం
- మెట్రో విస్తరణకు పెండింగ్ భూసేకరణ పూర్తి చేయాలని సీఎం సూచన
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బోగీలు
- మెట్రో కోచ్‌ల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని ఆదేశం 02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

హైదరాబాద్ మెట్రోరైల్ రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (HMRL)పై సీఎం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని తెలిపారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.


**అదనపు బోగీలపై..**

హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్‌కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచెస్‌ను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్-2 లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

### కలలకు పునాదులు వేయాలంటే సంకల్పం ఉండాలి..!

- కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్య భేదాలు తొలగించాలి
- ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక రెసిడెన్షియల్ స్కూల్స్
- తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా రెసిడెన్షియల్ స్కూళ్లు 03

### 'ట్రంప్ టవర్స్'కు టీ-రెరా గ్రీన్ సిగ్నల్..



ట్రంప్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో 65 అంతస్తుల ట్విన్ టవర్స్ రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్టాత్మక నిర్మాణం 02

# భారీగా ఓట్లు గల్లంతు

## పార్టీల వెన్నులో వణుకు..

## రాష్ట్రవ్యాప్తంగా 21.70 శాతం ఓట్లు గాయబ్..!

**73,39,234 ఓట్లు మాయం**



- రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు.. 2.64 కోట్ల ఫారమ్‌లే డిజిటైజ్
- 73,39,234 ఓట్లకు ఎన్యుమరేషన్ పత్రాలు అందలేదని సీఈవో కార్యాలయం ప్రకటన
- 45.18 లక్షల మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు బదిలీ అయినట్లు గుర్తింపు
- 9.22 లక్షల మంది మరణించిన ఓటర్లుగా నమోదు
- 11.25 లక్షల మంది ఓటర్లు అందుబాటులో లేరని అధికారుల వెల్లడి
- 6.70 లక్షల మంది డబుల్ ఓటర్లుగా గుర్తింపు
- ఇతర కారణాలతో 1.02 లక్షల ఓట్లకు ఎన్యుమరేషన్ జరగలేదని స్పష్టం
- మొత్తం ఓటర్లలో 21.70 శాతం వివరాలు డిజిటైజ్ కాలేదని వెల్లడి 02



# దేశంలో ప్లాస్టిక్ నోట్లకు కేంద్రం ఆమోదం

**పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే 2027 ఏప్రిల్ నుంచి పూర్తి స్థాయి అమలు?**

- రూ.10, రూ.20 నోట్లతో ప్లాస్టిక్ కరెన్సీ ప్రయోగాత్మక ప్రారంభం
- ఆర్బీఐ ప్రతిపాదన మేరకు పైలట్ ప్రాజెక్ట్‌కు కేంద్రం ఓకే
- తొలుత 100 కోట్ల చొప్పున ప్లాస్టిక్ నోట్లు విడుదల
- కాగితపు నోట్ల కంటే పాలిమర్ నోట్లకు ఎక్కువ ఆయుష్షు 02

# ప్రకాష్ రాజ్ ఓటు తొలగింపు..



- ఓటర్ల జాబితా నుంచి నా పేరు తొలగించారు: ప్రకాష్ రాజ్
- ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రకాష్ రాజ్ తీవ్ర అభ్యంతరం
- బెంగళూరులోనే పుట్టి.. పెరిగానన్న నటుడు ప్రకాష్ రాజ్
- తొలగించిన 65 లక్షల ఓట్లలో తన ఓటు కూడా ఉందని వెల్లడి 02

**నా ఓటు తొలగించి, ఆట మొదలు పెట్టారు**

# సోలార్ స్కీమ్‌లో రూ.200 కోట్ల స్కామ్..



- రేవంత్ సర్కార్‌పై అవినీతి, క్రెడిట్ చోరీ ఆరోపణలు
- పీఎం సూర్యఘర్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీతో కలిపేసింది 03
- 40 వేల ఇళ్లలో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు టెండర్లలో భారీ స్కామ్: బీజేపీ ఎంపీ
- ఒక్కో ఇంటిపై రూ.50 వేల తేడా.. డబ్బు ఎవరి జేబుల్లోకి?

# జార్ఖండ్ ఘటనపై అభిజీత్ దీప్కే

**లీడర్లకు లేని టియర్ గ్యాస్ కేవలం స్టూడెంట్స్‌పైనే ఎందుకు?**



- రాజకీయ పార్టీల ఆందోళనలపై ఇదే చర్యలు ఎందుకు ఉండవని ప్రశ్న
- తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న దేవేంద్ర మహతోపై లాఠీచార్జ్ 02



# నిషేధిత భూములపై ఆందోళన వద్దు..

- 22ఏ/పీవోబీ భూములపై ప్రజలు అపోహలు వద్దు: మంత్రి పొంగులేటి
- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదు
- గత ప్రభుత్వ కాలం నాటి సాంకేతిక చిక్కులను పరిష్కరిస్తాం
- భూ రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన పత్రాలన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి
- ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టేలా చర్యలు
- సబ్‌రిజిస్ట్రార్లకు వహానీల యాక్సెస్ కల్పించేందుకు చర్యలు
- జెన్యూన్ దరఖాస్తులను గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి
- ప్రజా కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి: కలెక్టర్లకు మంత్రి సూచన 03

# కేటీఆర్ సంచలన ఆరోపణలు

**అసలు మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలుసా శ్రీధర్ బాబు గారు?**

## రేవంత్‌రెడ్డి షెల్ కంపెనీల బాగోతాన్ని బయట పెడతాం



**రూ.200 కోట్ల భూమిని రూ.7 కోట్లకే కట్టబెట్టారన్న కేటీఆర్**

- రేవంత్ సర్కార్‌పై మరో భారీ భూ కుంభకోణం ఆరోపణలు: కేటీఆర్
- రూ.200 కోట్ల భూమిని రూ.7 కోట్లకే కట్టబెట్టారన్న కేటీఆర్
- 'టెసరాక్ట్' కంపెనీకి భూ కేటాయింపుపై బీఆర్ఎస్ ప్రశ్నలు
- కంపెనీకి ఒక్క ఉద్యోగి కూడా లేరని కేటీఆర్ ఆరోపణ 03
- టెసరాక్ట్ చైర్మన్‌గా సీఎం సోదరుడు కొండల్ రెడ్డి ఉన్నారని వెల్లడి
- అనుభవం లేని సంస్థకు ఐదెకరాల భూమి ఎలా కేటాయించారని ప్రశ్న
- ఏరోస్పేస్, డిఫెన్స్ పేరుతో భూమి కేటాయింపుపై నిలదీత
- టెసరాక్ట్ వ్యవహారంపై మంత్రి శ్రీధర్ బాబును ప్రశ్నించిన కేటీఆర్
- 'మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలుసా?' అంటూ మంత్రి శ్రీధర్ బాబుపై ఫైర్



# లక్ష మందితో సీఎం సభకు ఏర్పాట్లు

- ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ
- లక్ష మంది జనంతో సభ నిర్వహణకు భారీ ఏర్పాట్లు
- మధ్యాహ్నం 2 గంటలకు సంగారెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి
- సాయంత్రం 4 గంటల వరకు సంగారెడ్డిలోనే సీఎం
- ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు 02

# ప్రకాష్ రాజ్ ఓటు తొలగింపు..

**బెంగళూర్ :** ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తన ఓటును తొలగించారని పేర్కొన్నారు. బెంగళూర్ నియోజకవర్గం ఓటర్ల జాబితా నుంచి తన పేరు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బెంగళూర్‌లోనే పుట్టి, పెరిగానని, ఇక్కడే చదువుకున్నానని అన్నారు. ఎంపీగా కూడా పోటీ చేశానని, తొలగించిన 65 లక్షల ఓటర్లలో తాను కూడా ఒకడినని అన్నారు. తన ఓటర్ ఐడీ తిరిగి పొందేందుకు ఎలాంటి పత్రాలను సమర్పించాలో కూడా తనకు తెలియదని అన్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని "పెద్ద జోక్" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "నా ఓటర్ ఐడీని తిరిగి పొందడానికి నేను ఏ పత్రాలను చూపించాలో చూస్తాను. ఆట మొదలైంది, తమ శక్తిని ప్రదర్శించడానికి వారు ఇవన్నీ చేయగలరు. నా ఓటు హక్కును వాళ్లు ఆపగలరు, కానీ నన్ను ఆపగలరా?" అంటూ ప్రశ్నించారు. ప్రకాష్ రాజ్ ఓటు హక్కుకు సంబంధించిన వివాదాలు ఉన్నాయి. గత జూన్ నెలలో బెంగళూర్ కోర్టు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2019లో న్యాయవాది దిలీప్ కుమార్ హలసూర్ గేట్ పోలీస్ స్టేషన్‌లో ప్రకాష్ రాజ్‌పై ఫిర్యాదు చేశారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో పాటు నాలుగు రాష్ట్రాల్లో ఆయనకు ఓటు హక్కు ఉందని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ల ప్రక్షాళన ప్రక్రియలో ఆయన పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించడంపై ప్రకాష్ రాజ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తన ఓటు హక్కును తిరిగి పొందేకు అవసరమైన పత్రాలనను సమర్పిస్తానని తెలిపారు.

# జార్ఖండ్ ఘటనపై అభిజీత్ దీప్కే

**ఢిల్లీ :** జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ఉపయోగించడాన్ని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీలు ఆందోళనలు చేసినప్పుడు టియర్ గ్యాస్, లాఠీచార్జ్ ఎందుకు చేయడం లేదని, కేవలం విద్యార్థులపై మాత్రమే ఇలాంటి చర్యలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మంగళవారం మహారాష్ట్రలో మీడియాతో మాట్లాడిన దీప్కే.. జార్ఖండ్‌లో విద్యార్థుల ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న దేవేంద్ర మహతోతో తాను మాట్లాడినట్లు చెప్పారు. తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ పోలీసులు ఆయనపై లాఠీచార్జ్ చేశారని మహతో తనతో చెప్పినట్లు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వాలు విద్యార్థులపై ఇలాంటి దమనకాండకు పాల్పడటం ద్వారా ఏం సాధిస్తున్నాయో ఆలోచించాలని ఆయన సూచించారు. విద్యార్థులపై ఇలాంటి క్రూరత్వం జరగకూడదని హెచ్చరించారు. దేవేంద్ర మహతోకు తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చామని, జార్ఖండ్‌లో తమ బృందం విద్యార్థులతో కలిసి పనిచేస్తోందని అభిజీత్ దీప్కే తెలిపారు.

# భారీగా ఓట్లు గల్లంతు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా 73,39,234 ఓట్లు తగ్గినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. నిన్నటితో గడువు ముగియడంతో ఎస్ఐఆర్‌పై తాజాగా సీఈవో కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ వివరాల ప్రకారం రాష్ట్రం వ్యాప్తంగా మొత్తం ఓటర్ల సంఖ్య 3,38,26,448 ఉండగా అందులో డిజిటైజ్ చేసిన ఎన్యుమరేషన్ ఫారమ్‌లు 2,64,87,214 మాత్రమేనని పేర్కొన్నారు. 73,39,234 ఓట్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ పత్రాలు రాలేదని అధికారులు స్పష్టం చేశారు. వీటిలో ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఓటర్లు 45,18,961, మరణించిన ఓటర్లు 9,22,230, అందుబాటులో లేని ఓటర్లు 11,25,546, మరో చోట ఓటు ఉన్న వారు (డబుల్ ఓటర్లు) 6,70,203, ఇతర కారణాలతో ఎన్యూమరేషన్ కాని వారు 1,02,294 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు.

**21.70 శాతం ఓట్లు గల్లంతు!**

మొత్తం ఓటర్లలో 78.30 శాతం మంది వివరాలు డిజిటైజ్ కాగా మిగిలిన 21.70 శాతం ఫారమ్‌లు మరణాలు, చిరునామా మార్పులు, డబుల్ ఓట్లు ఎన్యూమరేషన్ పత్రాలు సేకరించబడలేదని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. దీంతో ఈ నెల 17వ తేదీన ఎన్నికల సంఘం విడుదల చేయబోతున్న ముసాయిదా ఓటరు జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెల కొంది. ఈ ముసాయిదా జాబితాలో ఎవరి ఓటు ఉండబోతోంది ఎవరి పేరు గల్లంతు కాబోతోంది అనేది సస్పెన్స్ గా మారింది. ముసాయిదా వెలువడిన అనంతరం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 30 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటి పరిష్కారాన్ని అక్టోబరు 15వ తేదీలోపు పూర్తి చేస్తారు. ఆ తర్వాత అక్టోబరు 19 వరకు తుది ఓటరు జాబితాను వెల్లడించనున్నారు.

**రాజకీయ పార్టీలు అప్రత్తం:**

ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా రాష్ట్ర ఓటరు జాబితాలో పెద్ద ఎత్తున మార్పులు సంభవించబోతున్న సంకేతాల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తం అయ్యాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలోని ఎస్ఐఆర్ పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అనామలీస్ జాబితాలో 73 లక్షల ఓట్లు ఉన్నాయంటే పార్టీకి ఇంత యంత్రాంగం ఉండి లాభం అని పార్టీనేతలను ప్రశ్నించినట్లు సమాచారం. ఇకనైనా ఇంటింటికి వెళ్లి తనిఖీ చేపట్టాలని అర్హత కలిగిన వారు ఓట్లు కోల్పోతే అది నష్టం చేస్తుందని పార్టీకి దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఇక బీఆర్ఎస్, బీజేపీ సైతం తమ నేతలతో భేటీ అయితే గల్లంతవుతున్న ఓట్ల విషయంలో పార్టీ శ్రేణులను అలర్ట్ చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. దీంతో తగ్గిన 73,39,234 ఈ ఓట్లలో చివరకు ఎన్ని ఉంటాయి ఎన్ని గాయాబ్ అవుతాయి అనేది రాజకీయ పార్టీలకు టెన్షన్ గా మారింది.

# దేశంలో ప్లాస్టిక్ నోట్లకు కేంద్రం ఆమోదం

**ఢిల్లీ :** భారతీయ కరెన్సీ రంగంలో విప్లవాత్మక మార్పులకు రంగం సిద్ధవుతోంది. దేశంలో తొలిసారిగా పాలిమర్ లేదా ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపాయి. ఇందులో భాగంగా అత్యధికంగా చెలామణిలో ఉండే తక్కువ విలువ కలిగిన రూ.10, రూ.20 నోట్లను ప్లాస్టిక్ మెటీరియల్‌తో ముద్రించి, ఫీల్డ్‌లో ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రిజర్వ్ బ్యాంక్ చేసిన ప్రతిపాదన మేరకు తొలుత వంద కోట్ల చొప్పున ఈ నోట్లను మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ప్లాస్టిక్ నోట్ల ఆయుష్షు చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా రూ.10, రూ.20 వంటి చిన్న నోట్లు చేతులు మారుతుండటం వల్ల త్వరగా పాడైపోతుంటాయి. పాలిమర్ నోట్ల ద్వారా ఆ సమస్య తీరడంతో పాటు నకిలీ నోట్ల బెడదను కూడా సమర్థవంతంగా అరికట్టవచ్చని భావిస్తున్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, అంతా అనుకున్నట్లుగా జరిగితే 2027 ఏప్రిల్ నాటికి ప్లాస్టిక్ నోట్లను పూర్తిస్థాయిలో సర్క్యులేషన్‌లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల తెలిపారు. ప్రస్తుతానికి ఇది కేవలం ప్రయోగాత్మక దశ మాత్రమేనని, మార్కెట్లో ఉన్న పాత కాగితపు నోట్లు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# లక్ష మందితో సీఎం సభకు ఏర్పాట్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. సుమారు లక్ష మంది జనంతో ఈ సభను ఏర్పాటు చేయనున్నారు. సభలో పాల్గొనేందుకు ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు రేవంత్ రెడ్డి సంగారెడ్డి చేరుకుంటారు. సాయంత్రం 4 గంటల వరకు సంగారెడ్డిలోనే ఆయన ఉండనున్నారు. ఈ సందర్భంగా సీఎం ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కరికి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయనున్నారు. సభా వేదికపై 10 మంది లబ్ధిదారులకు స్వయంగా స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వనున్నారు. సభ నిర్వహణపై సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జన సమీకరణ, వేదిక, భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు మంత్రి ఉత్తమ్ సూచించారు. సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

# మెట్రో రద్దీకి చెక్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మెట్రోరైల్ రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పై సీఎం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని తెలిపారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

**అదనపు బోగీలపై..**

హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్‌కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచెస్‌ను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్-2 లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

**డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్..**

డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్‌లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఆరుతడి పంటల సాగు పై రైతులు దృష్టి సారించాలి

**ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లా రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నట్లు గమనించామని.. కానీ ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తతతో వ్యవహరించాలని కోరారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందా అనే విషయాన్ని ఆలోచించుకోవాలన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు సరిపడా నీటి లభ్యత ఉండకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు అవగాహన కల్పిస్తున్నామని, ఆరుతడి పంటల సాగుతో రైతులు అధిక దిగుబడులతో పాటు లాభాలు పొందాలని సూచించారు. అలాగే ఈ నెల 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపు పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎక్కడైనా అక్రమంగా తరలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

# 'ట్రంప్ టవర్స్'కు టీ-రెరా గ్రీన్ సిగ్నల్..





**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని ప్రముఖ ఐటీ కారిడార్ అయిన కోకాపేట్ గోల్డెన్ మైల్ ప్రాంగణం మరో భారీ అంతర్జాతీయ విలాసవంతమైన ప్రాజెక్ట్‌కు వేదిక కాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో ఏకంగా 65 అంతస్తులతో ట్విన్ టవర్ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. నగరంలో అత్యున్నత జీవన ప్రమాణాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ నుంచి అధికారిక అనుమతులు లభించాయి. సుమారు రూ.3,500 కోట్ల భారీ అంచనా వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఈ లగ్జరీ ప్రాజెక్ట్‌ను అమెరికాకు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్, భారత్‌లో ఆ సంస్థ భాగస్వామి అయిన ట్రిబెకా డెవలపర్స్, నగరానికి చెందిన ఐరా రియాల్టీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. గురుగ్రామ్, ముంబై, పుణే, కోల్‌కతా నగరాల తర్వాత భారతదేశంలో నిర్మితమవుతున్న 5వ ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం.

**450 అత్యంత ఖరీదైన 'అల్ట్రా లగ్జరీ' ఫ్లాట్లు**

సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ ట్విన్ టవర్లలో కేవలం 450 అత్యంత ఖరీదైన ఫ్లాట్లను మాత్రమే నిర్మించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా గ్లాస్ ఫ్యాకేడ్ డిజైన్, స్మార్ట్ హోమ్ ఆటోమేషన్, ప్రైవేట్ వ్యూయింగ్ డెక్స్‌లతో పాటు 3.5 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే, స్కై డుప్లెక్స్ మోడళ్లలో ఈ ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు ఈ ట్విన్ టవర్లను కలుపుతూ మధ్యలో వినూత్నంగా ఏర్పాటు చేయనున్న 'స్కై బ్రిడ్జ్' ఈ ప్రాజెక్ట్‌కు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మాణ పనులను ప్రారంభించిన మూడేళ్ల వ్యవధిలోనే పూర్తి చేయాలని భాగస్వామ్య సంస్థలు టార్గెట్‌గా పెట్టుకున్నాయి. అయితే, ప్రాజెక్ట్ భూమిపూజ, గ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో ట్రంప్ ఫ్యామిలీ మెంబర్స్‌కు కూడా స్వయంగా పాల్గొనబోతున్నట్లుగా తెలుస్తోంది. ఓ వైపు ఔటర్ రింగ్ రోడ్డు, మరోవైపు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే కోకాపేటలో ఈ ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్ రాకతో హైదరాబాద్ గ్లోబల్ రియల్ ఎస్టేట్ రంగానికి సరికొత్త గుర్తింపు లభించనుంది.

# నేను కాంగ్రెస్ జెండా కప్పుకోలేదు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పార్టీ మార్పు, తన నియోజకవర్గానికి నిధుల విడుదలపై మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన మీడియాలో మాట్లాడుతూ.. తాను ఏ మంత్రి పదవో, డబ్బు ఆశించి కాంగ్రెస్ వైపు అడుగులు వేయలేదని, కేవలం బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మార్పు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ను మోసం చేసి పార్టీ మారడం తనకు ఎంతమాత్రం ఇష్టం లేదని అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను తానెప్పుడూ మర్చిపోనని తెలిపారు. కానీ, నియోజకవర్గానికి రావాల్సిన పనుల కోసం తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆ అడుగు పడిందని తన ఆవేదనను వెళ్లగక్కారు. తాను స్వార్థంతో కాకుండా కేవలం జాతీయ జెండా కప్పుకునే భావనతోనే ముందడుగు వేశానని పోచారం కామెంట్ చేశారు.

**సీఎం, మంత్రులు నా ఫోన్ ఎత్తట్లేదు..**

ఇక బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న డెవలప్‌మెంట్ బిల్లులు, ప్రాజెక్టు నిధులను 6 నెలల్లోగా పూర్తిస్థాయిలో మంజూరు చేస్తామని పార్టీ మారుతున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని పోచారం శ్రీనివాస రెడ్డి గుర్తుచేశారు. కానీ, పార్టీ మారిన తర్వాత ఇప్పటి వరకు కేవలం సగం నిధులను మాత్రమే మంజూరు చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన సగం నిధుల మంజూరు ప్రక్రియ ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోవడం వల్ల అభివృద్ధి పనులకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, పెండింగ్ నిధులు, అభివృద్ధి పనుల గురించి అడిగేందుకు తాను స్వయంగా ప్రయత్నించినప్పటికీ సీఎం గానీ, సంబంధిత మంత్రులు గానీ ఏ ఒక్కరూ తన ఫోన్ కాల్స్ ఎత్తడం లేదని ఫైర్ అయ్యారు. ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం అధికారుల, నాయకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పోచారం చేసిన వ్యాఖ్యలు అటు కాంగ్రెస్ పార్టీలో.. రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# కేటీఆర్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో భారీ భూ కుంభకోణానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'టెసరాక్ట్' అనే నకిలీ కంపెనీకి ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7 కోట్లకే కట్టబెట్టిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి ప్రమేయం ఉందని ఆధారాలతో సహా బయటపెట్టారు. టెసరాక్ట్ కంపెనీకి కనీసం ఒక ఉద్యోగి కూడా లేరు. 2025 మార్చి 31న ఆ కంపెనీయే స్వ-యంగా తమకు ఉద్యోగులు లేరని ప్రకటించుకుంది. ఈ కంపెనీ ఇచ్చిన ఫోన్ నంబర్ 123456789 ఇది.. ఇలాంటి నంబర్లు ఉంటాయని కూడా మాకు తెలియదు.. ఇంతటి అబద్ధపు నంబర్‌తో కంపెనీ నడుపుతున్నారంటే ప్రభుత్వం ఎంతలా అవినీతికి పాల్పడుతుందో అర్థం చేసుకోవచ్చు. టెసరాక్ట్ కంపెనీకి చైర్మన్‌గా సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఇదే విషయాన్ని ఆయన తన లింక్డ్ ఇన్ ప్రొఫైల్‌లో కూడా బహిరంగంగా పేర్కొన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ పరికరాలు తయారు చేస్తామన్న నెపంతో, ఎలాంటి అనుభవం లేని ఈ కంపెనీకి ప్రభుత్వం ఐదెకరాల విలువైన భూమిని కారుచౌకగా (రూ.7 కోట్లకు) అప్పగించింది.

**మంత్రి శ్రీధర్ బాబుపై ప్రశ్నలు..**

ఈ కంపెనీకి, ముఖ్యమంత్రి సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు బుకాయిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. "అసలు మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలుసా శ్రీధర్ బాబు గారు? కొండల్ రెడ్డి చైర్మన్ అని వారి ప్రొఫైల్‌లో ఉంటే, సంబంధం లేదని ఎలా చెబుతారు?" అని నిలదీశారు. కర్ణాటకలో భూ కేటాయింపులపై సిద్ధరామయ్యపై ఫిర్యాదు వస్తే రాజీనామా చేసే పరిస్థితి వచ్చిందని, తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతోందని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డికి ఎలాంటి అధికారిక హోదా లేకున్నా, కలెక్టర్లు, ఎస్పీలు ఆయనకు వంగివంగి దండాలు పెట్టడం రాష్ట్రంలో జరుగుతున్న అరాచకానికి నిదర్శనమన్నారు. అమెరికా పర్యటనలో వెయ్యి కోట్ల 'స్వచ్ఛ బయో' డీల్, బామ్మర్ది సృజన్ రెడ్డికి దక్కిన రూ. 1137 కోట్ల అమృత్ కాంట్రాక్టులు అన్నీ రేవంత్ రెడ్డి బంధుప్రీతిని చాటి చెబుతున్నాయని అన్నారు. ఈ భూ కుంభకోణాన్ని తాము వదిలిపెట్టే ప్రసక్తే లేదని, టెసరాక్ట్ కంపెనీ బండారం బయటపెట్టే వరకు పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

**అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తాం..**

తెలంగాణలో రూ.74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయ-మని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత తమ పార్టీ నేతలు, న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా.?, లేదా.? స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండాను మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రప్రభుత్వం చెప్పినా రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ఈ ప్రభుత్వం చేయాల్సిన పనిని సక్రమంగా చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు..

**న్యూ ఢిల్లీ :** విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు పై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఆ బిల్లును ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపించేందుకు నోట్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రజలు, మైనారిటీ సంస్థలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం FCRA బిల్లును జేపీసీకి పంపేందుకు మొగ్గు చూపింది. మరోవైపు ఇదే బిల్లును ప్రభుత్వం బేషరుతగా ఉపసంహరించుకోవాలని ఉభయ సభల్లో కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

**జేపీసీకి పంపితే జరిగేది ఇదే..**

ఒకవేళ FCRA బిల్లును లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన జాయింట్ పార్లమెంట్ కమిటీ (JPC)కి పంపితే.. బిల్లులోని ప్రతీ నిబంధనను, ముఖ్యంగా ఆస్తుల నిర్వహణ, జరిమానాలకు సంబంధించిన ప్రతి చాప్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు, చట్టపరమైన నిపుణులు, ధార్మిక ట్రస్టులు, ప్రభుత్వ అధికారుల నుంచి లిఖితపూర్వక, ప్రత్యక్ష సాక్ష్యాలను జేపీసీ సేకరించనుంది. కమిటీ తన సిఫార్సులతో నివేదికను రూపొందించిన తర్వాత, తదుపరి పార్లమెంట్ సమావేశాల్లో సవరించిన బిల్లును ఉభయ సభల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది.

**గతంలో ఇలానే వక్ఫ్ సవరణ బిల్లు..**

గతంలో ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లు-2024 విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇదే విధమైన పార్లమెంటరీ మార్గాన్ని ఎంచుకుంది. ఆ బిల్లును కూడా చట్టంగా రూపకల్పన చేయడానికి ముందు విస్తృతమైన చర్చలు, న్యాయ నిపుణుల అభిప్రాయ సేకరణ, క్షుణ్ణమైన పరిశీలన కోసం జేపీసీకి పంపించారు. అదే తరహాలోనే ఇప్పుడు FCRA సవరణ బిల్లుపై కూడా పార్లమెంట్ సభ్యులు, నిపుణుల సలహాలను స్వీకరించేందుకు జేపీసీకి నివేదించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**విపక్షాల ఆందోళన..**

ఇక FCRA సవరణ బిల్లులోని కొన్ని నిబంధనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా విదేశీ విరాళాల నమోదు రద్దయినా, ముగిసినా, స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్నా.. ఆ నిధులతో ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సెంటర్ల వంటి ఆస్తులను ప్రభుత్వ 'డెసిగ్నేటెడ్ అథారిటీ' స్వాధీనం చేసుకునే నిబంధనపై భయాందోళనలు నెలకొన్నాయి. అయితే, విదేశీ నిధుల ప్రవాహాన్ని నియంత్రించడం, పారదర్శకతను పెంచడం, జాతీయ భద్రతను కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని కేంద్రం చెబుతోంది.

# కొత్త పింఛన్ల అర్హతలపై ప్రభుత్వం క్లారిటీ..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో కొత్త పింఛన్ల అర్హతలపై ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదని గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోందని స్పష్టం చేసింది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలించబోతున్నట్లు తెలిపింది. ఈ మే-రకు ఇవాళ ఓ ప్రకటన విడుదల చేసింది. అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపింది.

**కొత్త వారే దరఖాస్తు చేసుకోవాలి:**

ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. అయితే గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసం-మైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారని.. వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత-జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం అని పేర్కొంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపింది.

**ఈ నెలాఖరువరకు దరఖాస్తులు:**

ప్రతి అర్హుడికి చేయూత అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించినట్లు ప్రభుత్వం తెలిపింది. ముఖ్యంగా ప్రతి అర్హత కలిగిన వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో సహకరించాలని సూచించారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31, 2026 వరకు స్వీకరిస్తారు. దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టనున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఉన్న అర్హత నిబంధనలనే కొనసాగిస్తూ, అర్హులైన వారికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రక్రియను వేగవంతం చేసినట్లు పేర్కొంది.

# కలలకు పునాదులు వేయాలంటే సంకల్పం ఉండాలి..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన స్ ప్లాట్ఫామ్ వేదికగా ఆయన.. భవనాలు నిర్మించడం సులభమేనని, అయితే విద్యార్థుల కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలని అన్నారు. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా.. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలకడంతో పాటు కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం వంటి భేదాలను తొలగించి ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ విద్యాలయాలు పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయని పేర్కొన్నారు. ఈ పాఠశాలలు పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలు, పరిపాలకులు, పారిశ్రామికవేత్తలు, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ

మోడల్‌కు ప్రతీకగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిలుస్తాయని సీఎం పేర్కొన్నారు. ఈ పాఠశాలలు కేవలం విద్యను అందించే కేంద్రాలుగా కాకుండా, తరతరాల భవిష్యత్తును మార్చే సంస్థలుగా రూపుదిద్దుకుంటాయని రేవంత్ రెడ్డి తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# నిషేధిత భూములపై ఆందోళన వద్దు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో నిషేధిత ఆస్తుల పీవోబీ/22ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవ-సరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామన్నారు. భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూ సేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని, రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనే దానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు యాక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చిన దరఖాస-్తుల్లో ఏది జెన్యూన్, ఏది కాదు? అని గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రజాకోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో 22ఏ/పీవోబీ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

**ప్రతి కేసును స్టడీ చేయాలి..**

22ఏ కు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పొంగులేటి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,, సమస్య వచ్చినపుడు పరిష్కరించే దాని కన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. పీవోబీ దరఖాస్తులకు సంబంధించి కేస్ బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఏ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, అదనపు అధికారాలు వద్దని.. ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చానన్నారు. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపే వరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏ మాత్రం రాజీపడే ప్రసక్తే లేదు. ఏ చిన్న తప్పు చేసినా క్షమించేది లేదన్నారు. కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్, ఐజీ దృష్టికి తీసుకురావాలన్నారు.

**మూడు రోజులు టైం తీసుకోవాలి..**

పీవోబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలని మంత్రి సూచించారు. పీవోబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇక నుంచి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుంచి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుంచి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలన్నారు. గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వల్ల సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయన్నారు. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలి. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డీఎస్ లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

# సోలార్ స్కీమ్‌లో రూ.200 కోట్ల స్కామ్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇస్తున్న నిధులను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ అవినీతి, క్రెడిట్ చోరీకి పాల్పడటంతో పాటు అంకెల గారడీకి పాల్పడుతోందన్నారు. రాష్ట్రంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని కేంద్ర ప్రభుత్వ 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'తో మిక్స్ చేశారని విమర్శించారు. తొలిదశలో 40 వేల ఇళ్లను గుర్తించి, 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పిలిచిన టెండర్లలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపించారు.

**రూ. 50 వేల తేడా - ఎవరి జేబుల్లోకి?:**

ఒక్కో ఇంటికి 2 కేలోవాట్స్ సోలార్ ప్యానెల్స్ కోసం టెండర్ దక్కించుకున్న సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో రూ. 1.36 లక్షలకు ఒప్పందం చేసుకుని, అదే సంస్థ ఆ తర్వాత వేరొకరికి రూ. 86 వేలకే సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చిందన్నారు. దీంతో ఒక్కో ఇంటిపై మిగులుతున్న రూ.50 వేల సొమ్ము టెండర్ కంపెనీకి వెళ్తోందా, లేక విద్యుత్ శాఖ మంత్రికా, సీఎం రేవంత్ రెడ్డికా అని ప్రశ్నించారు. ఈ రకంగా దాదాపు రూ. 200 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు.

**కేంద్ర మంత్రికి ఫిర్యాదు:**

2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్స్‌కు కేంద్ర ప్రభుత్వమే నేరుగా రూ. 60 వేల సబ్సిడీ ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఇస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. సొమ్ము కేంద్రానిదైతే సోకు కాంగ్రెస్ పాటిస్తోందని, పథకాలకు కేంద్ర క్రెడిట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రులను కలిసి ఫోటోలు దిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు.. హైదరాబాద్ వెళ్లాక కేంద్రం ఏమీ ఇవ్వలేదని విమర్శించడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత ఊరు కొండారెడ్డిపల్లిలోనూ ఈ సోలార్ ప్యానెల్స్ అమర్చారని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే మంగళవారం కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలసి ఈ రూ. 200 కోట్ల కుంభకోణంపై కేంద్ర ఏజెన్సీలతో దర్యాప్తు జరిపించాలని రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే లబ్ధిదారుల ఇళ్లపై ఇది కేంద్ర ప్రభుత్వ పథకమనే లోగోలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరినట్లు వెల్లడించారు. బురదజల్లడం మాని, జరిగిన పొరపాటుపై రాష్ట్ర ప్రభుత్వమే విచారణ జరిపించాలని లేదంటే కేంద్ర సంస్థల దర్యాప్తునకు సిద్ధపడాలన్నారు.




## పెన్షన్, పీఎఫ్ క్లెయిమ్‌లకు ఇక వేగంగా పరిష్కారం!

**కొత్తగూడెం సింగరేణి,ఫ్లాష్ ఇండియా :**

సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల రీఫండ్, పెన్షన్, పీఎఫ్ క్లెయిమ్‌లను సీ-కేర్స్ అప్లికేషన్ ద్వారా వేగవంతంగా పరిష్కరించేందుకు సింగరేణి-సీఎంపీఎఫ్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రయాస్-సమాధాన్' సమావేశాన్ని మంగళవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయ హెచ్ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి జీఎం (పర్సనల్, వెల్ఫేర్, సీఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ) కే. అజయ్ కుమార్, సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్లు వంశీధర్ కుసుంభ, ఎం. కనకమ్మ మాట్లాడుతూ.. సీ-కేర్స్ అప్లికేషన్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించడంతో పాటు పెన్షన్, పీఎఫ్ క్లెయిమ్‌లను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. కాంట్రాక్ట్ కార్మికుల వివరాలను కూడా సీ-కేర్స్‌లో నమోదు చేయాలని తెలిపారు. రిటర్న్ అయిన క్లెయిమ్‌లను సకాలంలో తిరిగి సమర్పించడం, పదవీ విరమణ చేయనున్న ఉద్యోగుల అనెక్సర్-III సమర్పణ, వీవీ స్టేట్‌మెంట్లు, పీఎస్-5 అప్‌లోడ్, కాంట్రాక్ట్ కార్మికుల డేటా నమోదు, సభ్యుల లాగిన్ తదితర అంశాలపై అధికారులు చర్చించారు. సమావేశంలో సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంపాదకీయం




# వృద్ధాప్యం వైపు భారత్..

భారత్ జనాభా నిర్మాణం వేగంగా మారుతోంది. ఒకప్పుడు యువ దేశంగా గుర్తింపు పొందిన భారత్.. రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల దేశంగా కూడా మారబోతోంది. ఇది కేవలం జనాభా లెక్కల్లో చోటుచేసుకునే మార్పు కాదు. కుటుంబ వ్యవస్థ, ఆరోగ్య రంగం, ఉపాధి, మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం, గ్రామీణ సామాజిక నిర్మాణం.. ఇలా సమాజంలోని దాదాపు ప్రతి రంగాన్నీ ప్రభావితం చేసే పరిణామం. 2050 నాటికి దేశ జనాభాలో దాదాపు ఐదో వంతు.. అంటే సుమారు 35 కోట్ల మంది 60 ఏళ్లు పైబడినవారే ఉండే అవకాశం ఉంది. అంటే ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులుగా ఉండబోతున్నారు. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. వీరిలో దాదాపు 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివసించే అవకాశముంది. దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, సంపన్న దేశంగా పూర్తిగా మారకముందే వృద్ధాప్య దశలోకి ప్రవేశించడం భారత్‌కు ఒక ప్రత్యేక సవాలు.

**కుటుంబమే ఆధారమైతే.. ఆ కుటుంబం ఎక్కడ ఉంటుంది?**

భారతీయ సమాజంలో వృద్ధుల సంరక్షణకు కుటుంబమే ప్రధాన ఆధారం. తల్లిదండ్రులను చూసుకోవడం, అనారోగ్య సమయంలో తోడుగా ఉండటం, రోజువారీ అవసరాలను తీర్చడం వంటి బాధ్యతలు ఇప్పటికీ ప్రధానంగా కుటుంబ సభ్యులపైనే ఉన్నాయి. ప్రస్తుతం వృద్ధుల సంరక్షణలో దాదాపు 94 శాతం కుటుంబాలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే కుటుంబం అనే వ్యవస్థే వేగంగా మారుతోంది. ఉమ్మడి కుటుంబాలు క్రమంగా తగ్గుతున్నాయి. చిన్న కుటుంబాలు పెరుగుతున్నాయి. విద్య, ఉద్యోగం, మెరుగైన జీవనావకాశాల కోసం యువత గ్రామాల నుంచి పట్టణాలకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి, దేశం నుంచి విదేశాలకు వలస వెళ్తోంది. ఫలితంగా ఒకే ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు కలిసి ఉండే పరిస్థితి తగ్గుతోంది. ఇది వృద్ధాప్య సంరక్షణను కేవలం కుటుంబ బాధ్యతగా చూడలేని పరిస్థితిని సృష్టిస్తోంది. 2001లో ప్రతి వృద్ధుడికి 8.4 మంది పని వయసు వారు ఉండగా, 2026 నాటికి ఆ సంఖ్య సగటున 5.2కు పడిపోనుందని అంచనాలు సూచిస్తున్నాయి. భవిష్యత్తులో ఈ నిష్పత్తి మరింత తగ్గితే.. వృద్ధుల సంరక్షణ బాధ్యతను మోసే కుటుంబ సభ్యుల సంఖ్య కూడా తగ్గుతుంది. అంటే సమస్య వృద్ధుల సంఖ్య పెరగడంలో మాత్రమే లేదు. వారిని చూసుకునే చేతులు తగ్గిపోవడమే అసలు సమస్య.

**కనిపించని కేర్ వర్క్.. మహిళల జీవితాలపై భారం**

భారతీయ కుటుంబాల్లో వృద్ధుల సంరక్షణ గురించి మాట్లాడినప్పుడు మరో ముఖ్యమైన అంశాన్ని విస్మరించలేం. అదే మహిళలపై పడుతున్న ఉచిత సంరక్షణ భారం. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యులు, పిల్లల సంరక్షణ వంటి పనుల్లో మహిళలే అధిక సమయం కేటాయిస్తున్నారు. అందుబాటులో ఉన్న అంచనాల ప్రకారం మహిళలు రోజుకు సగటున 305 నిమిషాలు సంరక్షణ బాధ్యతలకు కేటాయిస్తుండగా.. పురుషులు కేవలం 56 నిమిషాలు మాత్రమే వెచ్చిస్తున్నారు. ఇది కేవలం కుటుంబంలోని పనుల విభజనకు సంబంధించిన విషయం కాదు. ఇది మహిళల ఉపాధి, ఆదాయం, కెరీర్, ఆర్థిక స్వాతంత్ర్యంతో ముడిపడిన సామాజిక సమస్య. ఒక మహిళ రోజులో గంటల తరబడి కుటుంబ సభ్యుల సంరక్షణలో గడిపితే.. ఆమెకు ఉద్యోగం చేయడానికి, నైపుణ్యాలు పెంచుకోవడానికి లేదా ఆర్థికంగా ఎదగడానికి సమయం ఎంత మిగులుతుంది? అందుకే 'కేర్ ఎకానమీ'పై పెట్టుబడి పెట్టడం అంటే కేవలం వృద్ధులకు సేవలు అందించడం కాదు.. మహిళలకు కూడా ఆర్థిక అవకాశాలను సృష్టించడం. వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. తీవ్రమైన వేడి, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో వృద్ధులు, పిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారికి అదనపు సంరక్షణ అవసరం ఏర్పడుతుంది. ఆ అదనపు బాధ్యత కూడా ఎక్కువగా మహిళలపైనే పడే ప్రమాదం ఉంది.

**వైద్యం మారుతోంది.. కానీ మన ఆరోగ్య వ్యవస్థ?**

భారత్ ఆరోగ్య రంగం కూడా మరో కీలక మార్పును ఎదుర్కొంటోంది. ఒకప్పుడు అంటువ్యాధులు, ప్రసవాలు, చిన్నారుల ఆరోగ్యం వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా ఉండేవి. ఇప్పుడు మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయి. దేశంలో నమోదవుతున్న మరణాల్లో దాదాపు మూడింట రెండొంతులు ఇటువంటి అసంక్రమణ వ్యాధుల కారణంగానే జరుగుతున్నాయి. ఇక్కడే ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థకు ఒక పెద్ద ప్రశ్న ఎదురవుతోంది. ఆసుపత్రిలో చికిత్స చేయడం మాత్రమే ఆరోగ్య సంరక్షణ కాదు. వృద్ధులకు దీర్ఘకాలిక వైద్యం, ఇంటి వద్ద సంరక్షణ, ఫిజియోథెరపీ, మానసిక సహాయం, మందుల నిర్వహణ, వైకల్యంతో జీవించే వారికి నిరంతర సహకారం అవసరం. అంటే భవిష్యత్తు ఆరోగ్య విధానం 'జబ్బు వచ్చిన తర్వాత చికిత్స' నుంచి 'దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించేలా సంరక్షణ' వైపు మారాల్సిన అవసరం ఉంది.

**గ్రామమే భవిష్యత్తు కేర్ సెంటర్‌గా మారగలదా?**

వృద్ధుల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివసించబోతున్న నేపథ్యంలో.. ప్రతి వృద్ధుడినీ పట్టణంలోని పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లడం సాధ్యం కాదు. అందుకే సంరక్షణ వ్యవస్థను గ్రామస్థాయిలోనే నిర్మించాల్సిన అవసరం ఉంది. గ్రామ పంచాయతీలు, స్వయం సహాయక సంఘాలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు వంటి ఇప్పటికే ఉన్న వ్యవస్థలను ఒకదానితో ఒకటి అనుసంధానించడం ద్వారా స్థానిక స్థాయిలో 'కేర్ ఎకోసిస్టమ్'ను అభివృద్ధి చేయవచ్చు. ప్రతి కుటుంబం నుంచి కొద్ది దూరంలోనే ప్రాథమిక ఆరోగ్య సహాయం, వృద్ధుల పర్యవేక్షణ, ఇంటి వద్ద సంరక్షణ, అవసరమైనప్పుడు ఆసుపత్రులకు రిఫరల్ వంటి సేవలు అందుబాటులో ఉంటే.. కుటుంబాలపై పడే భారం కొంతవరకు తగ్గుతుంది. ఇది గ్రామీణ భారతదేశంలో కొత్త ఉపాధి అవకాశాలను కూడా సృష్టించగలదు. కేర్ ఎకానమీలో జీడీపీలో 2 శాతం పెట్టుబడి పెడితే సుమారు 1.1 కోట్ల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ మహిళలకు ఇది కొత్త ఆర్థిక అవకాశాలను తెరవగలదు.

**వృద్ధాప్యం సమస్య కాదు.. వ్యవస్థకు పరీక్ష**

వృద్ధుల సంఖ్య పెరగడం సహజమైన జనాభా పరిణామం. ఆయుర్దాయం పెరగడం, వైద్య సదుపాయాలు మెరుగుపడటం ఒక దేశ అభివృద్ధికి సంకేతాలే. కానీ ఎక్కువ కాలం జీవించే ప్రజలకు గౌరవంగా, ఆరోగ్యంగా, ఆర్థిక భద్రతతో జీవించే పరిస్థితులు కల్పించగలమా అన్నదే అసలు ప్రశ్న. వృద్ధాప్యాన్ని కేవలం పెన్షన్, ఆసుపత్రి, మందుల సమస్యగా చూస్తే సరిపోదు. అది కుటుంబ వ్యవస్థ, మహిళల శ్రమ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ప్రజారోగ్యం, సామాజిక భద్రతతో ముడిపడి ఉన్న విస్తృత సామాజిక అంశం. భారత్ ఇప్పటి నుంచే దీనికి సిద్ధం కావాలి. వృద్ధులను చూసుకోవడం కుటుంబాల వ్యక్తిగత బాధ్యతగా మాత్రమే మిగిలితే.. భవిష్యత్తులో ఆ కుటుంబాలపైనే భారం అసహన స్థాయికి చేరే అవకాశం ఉంది. అదే సమయంలో సంరక్షణ రంగాన్ని ఒక సామాజిక మౌలిక వసతిగా గుర్తించి ప్రభుత్వాలు పెట్టుబడులు పెడితే.. అది వృద్ధులకు భద్రత ఇవ్వడమే కాకుండా మహిళలకు ఉపాధి, గ్రామాలకు ఆర్థిక చైతన్యం, కుటుంబాలకు ఉపశమనం కలిగించగలదు. భారత్ ఎదుర్కొనబోయేది కేవలం 'వృద్ధుల జనాభా పెరుగుదల' కాదు. 'ఎవరు చూసుకుంటారు?' అనే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం కుటుంబం ఒక్కటే కాకుండా.. సమాజం, ప్రభుత్వం, ఆరోగ్య వ్యవస్థ, గ్రామీణ సంస్థలు కలిసి ఇవ్వాల్సిన సమయం వచ్చేసింది.

# సామాజిక తెలంగాణకే నా ధర్మపోరాటం

స్వతంత్ర భారతం 79వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుపుకోబోతున్నది. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి విముక్తి దొరికి 79 ఏళ్లు కాగా, నిజాం ఏలుబడి నుంచి బయటపడి స్వతంత్ర భారతదేశంలో హైదరాబాద్ స్టేట్ విలీనమై 78 ఏళ్లు అవుతున్నది. ఈ ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్య భారతదేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక వివక్ష కొనసాగుతుండటం అత్యంత దురదృష్టకరం. 'సాంఘిక అసమానతలు లేని సమసమాజాన్ని సాధించుకుందాం' అంటూ ఈ రోజుకు కూడా పిలుపునివ్వాల్సి రావడానికి కారణాలెన్నో. రాజ్యాధికారమే పరమావధిగా రాజకీయాలు చేయడం వేరు, ప్రజల జీవితాల్లో గుణాత్మక విప్లవాత్మక మార్పులు తెచ్చేలా రాజకీయాలను ఒక అస్త్రంగా మలచుకోవడం వేరు. 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ రెండో పంథాను ఎంచుకొని ప్రజల మధ్యకు వెళ్తున్నది. ప్రజలకు దూరంగా విధానాలను రూపకల్పన చేయడం కాదు, నిత్యం వారి మధ్యనే ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా విధానాలు రూపొందించాలని మేము నిశ్చయించుకున్నాం. తరాలు మారుతున్నా మారని అసమానతలు, వివక్ష, పీడన, కంటికి కనిపించని శత్రువుగా కొందరిని వెంటాడుతున్న అస్పృశ్యత... ఈ సమాజం ఎంతో పురోగమిస్తున్నట్టు కనిపిస్తున్నా దాని క్రీనీడలా దర్శనమిస్తున్నాయి. అంతరాలు, అసమానతలు, అవహేళనలు లేని సమాజాన్ని నిర్మించడం రాత్రికి రాత్రే సాధ్యం కాకపోవచ్చు. వేయి మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుందన్న వాస్తవాన్ని గ్రహించి తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలిగా నేను మొదటి అడుగు వేశాను. గతంలో ఎందరో సామాజిక న్యాయం పేరుతో రాజకీయ తెర పైకి వచ్చి, తర్వాత ఆ మూల సూత్రాన్ని వదిలేశారు. సామాజిక న్యాయం పేరుతో పిడికిలి ఎత్తిన నాలాంటి వాళ్ల కాళ్లకు ఆ అనుభవాలు పోటురాయిలా తగలవచ్చు. కానీ నేను తూలిపడిపోతే సామాజిక న్యాయం అనే అజెండాను శాశ్వతంగా కాలగర్భంలో కలిపేసేందుకు శక్తులెన్నో కాచుకు కూర్చున్నాయన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మీ బిడ్డగా, మహిళగా, ఒక అమ్మగా తెలంగాణలోని సకల జనులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పార్టీ ఏర్పాటు చేసిన రోజే హామీ ఇచ్చాను. పార్టీ ఏర్పాటు చేసిన వంద రోజుల్లో 'సామాజిక న్యాయ తెలంగాణ' సాధన కోసం ప్రతిజ్ఞ చేశాను. నాతో పాటు మా పార్టీ క్యాడర్‌తో ప్రతిజ్ఞ చేయించి మా పార్టీ మూల సిద్ధాంతమే సామాజిక న్యాయ తెలంగాణ అని విస్పష్టంగా తెలియజేశాం. సామాజిక న్యాయం అనగానే అది అగ్రవర్ణాలకు వ్యతిరేకం అనే భావనను కొందరు ప్రచారం చేశారు. కానీ భారతీయ సమాజంలో అనేక విప్లవాత్మక మార్పులకు బీజం వేసిన వాళ్లలో చాలామంది అగ్రవర్ణాలకు చెందిన వాళ్లు కూడా ఉన్నారు. ఏదైనా ఆచరించి చూపే చిత్తశుద్ధి ఉండాలే తప్ప, వాళ్లు పుట్టిన కులం ఏమిటి, పెరిగిన నేపథ్యం ఏమిటి అన్నది ఇక్కడ గమనంలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. భారతదేశం అనేక రంగాల్లో ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తున్నదని చెప్పుకుంటున్న ఈ రోజుల్లో కూడా సామాజిక, ఆర్థిక అసమానతలు, వివక్ష నన్ను కలచివేశాయి. సబ్బండ వర్గాల సర్వతోముఖాభివృద్ధి, సాధికారతే ధ్యేయంగా సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం సంకల్పం తీసుకున్నాను. సామాజిక న్యాయం పేరుతో కొన్ని ప్రయోజనాలు ఇస్తే ఆయా వర్గాల వాళ్లు ఓట్లు గుమ్మరిస్తారనే తాత్కాలిక ప్రయోజనాలు ఆశించే రాజకీయాల మధ్య మనం ఉన్నాం. సంక్షేమ పథకాలు తాత్కాలిక ఆసరానే ఇస్తాయి. జీవితాలలో శాశ్వత మార్పులు తేలేవు. అందుకే సంక్షేమ పథకాలతో పాటు రాజ్యాధికారంలో వాటా అడగడం, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఆ వర్గాలను సమాజంలో ఉన్నతంగా నిలపడం మా పార్టీ విధానం. రాజ్యాధికారం సాధించడం ప్రతి రాజకీయ పార్టీకీ లక్ష్యమే. అయితే ఆ రాజ్యాధికారంలో సబ్బండ వర్గాలను సమ్మిళితం చేయాలనేది నా అభిమతం. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ గడప తొక్కని కులాలను అసెంబ్లీలోను, పార్లమెంట్‌లోను చూడాలనేది నా డ్రీమ్. ఆ కల సాకారం కావాలంటే నా ఆచరణ కూడా అదే స్థాయిలో ఉండాలి. అందుకోసమే సామాజిక న్యాయం సాధించడం కాదు, సాకారం చేస్తామని చెప్తున్నాను. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు అనేవి దానంగానో ధర్మంగానో ఇచ్చేవి కావనీ, వారి రాజ్యాంగ హక్కు అనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించాలి. పెరుగుతోన్న ప్రైవేటీకరణతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉద్యోగాల్లో సరైన అవకాశాలు దక్కడం లేదు. దేశవ్యాప్తంగా లక్షలాది ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. మైక్ దొరికితే ఉపన్యాసాల్లో కమ్మటి ముచ్చట్లు చెప్పడం తప్ప బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇద్దామన్న సోయి పాలకులకు లేదు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఖాళీ అయ్యే ఉద్యోగాలకు అదే ఏడాది నోటిఫికేషన్‌లు ఇచ్చి, పోస్టు ఖాళీ అయిన మరుసటి రోజే కొత్త వారికి ఉద్యోగం ఇచ్చేలా వ్యవస్థల్లో మార్పులు తీసుకురావాలి. ఉద్యోగాలు, స్వయం ఉపాధితోనే అసమానతలు రూపుమాపుతాం అనుకోవడం పూర్తిగా నిజం కాదు. అదే నిజమైతే ఉద్యోగాలు, వ్యాపారాలు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీల సామాజిక హోదాలో మార్పులు రావాలి. కానీ అది ఆ కుటుంబాలకే పరిమితం అయింది. అది కూడా తాత్కాలికంగా. మూడు తరాలుగా రాజకీయాల్లో ఉండి ఉన్నత పదవులు పొందిన కుటుంబంలోని వాళ్లు సైతం కుల వివక్షను ఎదుర్కోవాల్సిన దుస్థితి మన చుట్టే ఉన్నది. ఈ పరిస్థితుల్లో స్పష్టమైన మార్పులు రావాలి. అంటే పరిపాలించే స్థానంలో ఉన్నవాళ్ల మైండ్ సెట్‌లో మార్పులు రావాలి. సమాజంలోని ప్రతి ఒక్కరినీ సమదృష్టితో గౌరవించుకునే విశాల దృక్పథం నాకు ఉన్నది. అందుకే ఈ సమాజానికి అమ్మలా పరిణతి చెందాలని అనుకుంటున్నానని పార్టీ ప్రకటన రోజే చెప్పాను. సామాజిక తెలంగాణ కోసం నా జీవితాన్ని అంకితం చేయాలని, అందుకోసం అవసరమైన ధర్మపోరాటం చేయడానికి సిద్ధమని ప్రకటించిన తర్వాత ప్రతి అడుగులోనూ ఆ స్ఫూర్తిని నింపుకుంటానని మరోసారి ప్రతిజ్ఞ చేస్తున్నాను. మాటలు కాదు, ఆచరణాత్మక రాజకీయాలను తెలంగాణకు పరిచయం చేయడమే కాదు... మహాత్మా పూలే, సాహు మహారాజ్, బాబా సాహెబ్ అంబేద్కర్‌ల బాటలో నడుస్తూ, భారత రాజ్యాంగ లక్ష్యం వైపుగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సాధికారత కోసం సమరం చేస్తాం. అదే క్రమంలో బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ల కోసం కొట్లాడడం ఒక చారిత్రక అవసరం. దీనిని పార్లమెంటులో చట్టం చేసేవరకు మా పోరాటం ఆపబోమని ప్రతిజ్ఞ చేస్తున్నాను. స్థానిక సంస్థలలో వాటా కోసం ప్రారంభమైన బీసీ కొట్లాట పార్లమెంట్‌లో సగం వాటా సాధించే దాకా ఆపబోం. పాలితులకు పాలకవర్గంలో సమ ప్రాతినిధ్యం దొరకడమే నిజమైన రాజ్యాధికారం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలతో సహా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలను ఇచ్చే దిశగా మా ప్రయాణం కొనసాగుతుంది. భూమ్యాకాశాలను ఒక్కటి చేసైనా రాజీలేని పోరాటం చేస్తాం. మహనీయులు కలలు కన్న సమ సమాజాన్ని సాధించి చూపుతాం.

# కొత్త ప్రత్యామ్నాయమా?

దేశ రాజకీయాల్లో కొత్త వేదికలు, కొత్త రాజకీయ ప్రయోగాలు పుట్టుకురావడం సహజం. ముఖ్యంగా యువత, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు బలపడుతున్న సమయంలో.. ఆ ఉద్యమాలు రాజకీయ రూపం దాల్చే అవకాశాలు కూడా ఉంటాయి. ఇప్పుడు 'కాక్రోచ్ పార్టీ' పేరిట జరుగుతున్న ప్రచారం, రాష్ట్రాల వారీగా విస్తరిస్తున్న కార్యకలాపాలు, విద్యార్థి ఉద్యమాలకు మద్దతు, సీజేపీతో సమన్వయం, సెప్టెంబర్‌లో నిర్వహించనున్న 'క్యా బోల్తి పబ్లిక్' కార్యక్రమం వంటి పరిణామాలు ఇదే చర్చకు దారితీస్తున్నాయి. అసలు ప్రశ్న ఏమిటంటే.. 'కాక్రోచ్' కేవలం ఉద్యమ వేదికగానే కొనసాగుతుందా? లేక భవిష్యత్తులో ఎన్నికల రాజకీయాల్లోకి అడుగుపెట్టి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని చూస్తుందా?

**యువతే ప్రధాన బలం**

దేశ రాజకీయాల్లో యువత ఓటు ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోంది. నిరుద్యోగం, ఉద్యోగ నియామకాల్లో జాప్యం, పరీక్షల్లో పారదర్శకత, విద్యా అవకాశాలు, భవిష్యత్తుపై అనిశ్చితి వంటి అంశాలు యువతలో అసంతృప్తికి కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి సమస్యలపై గళమెత్తడం, నిరసనలకు మద్దతు ఇవ్వడం ద్వారా యువతలో రాజకీయ గుర్తింపును సంపాదించుకోవడం కొత్త రాజకీయ వేదికలకు కీలక వ్యూహంగా మారుతోంది. ఇటీవల జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలకు మద్దతు ప్రకటించడం కూడా ఈ కోణంలోనే చర్చకు వచ్చింది. అయితే విద్యార్థి ఉద్యమాల్లో ప్రజాదరణ పొందడం ఒక విషయం.. అదే ప్రజాదరణను ఎన్నికల ఓట్లుగా మార్చడం మరో విషయం.

**ఉద్యమం వేరు.. ఎన్నికలు వేరు**

ప్రభుత్వ విధానాలను విమర్శించడం, ప్రజా సమస్యలపై నిరసనలు నిర్వహించడం ద్వారా ఒక సంస్థ ప్రజల్లో గుర్తింపు పొందవచ్చు. కానీ ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత బాధ్యత మరింత పెరుగుతుంది. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి, ఆర్థిక విధానం, సామాజిక న్యాయం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రజల ముందుంచాల్సి ఉంటుంది. కేవలం ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగా రాజకీయ ప్రత్యామ్నాయం నిర్మించడం దీర్ఘకాలంలో సాధ్యం కాదు. అందుకే 'కాక్రోచ్'కు అసలు పరీక్ష ప్రజల్లో కనిపించడం కాదు.. ప్రజలకు ఆచరణ సాధ్యమైన ప్రత్యామ్నాయ పాలనా విధానాన్ని చూపించడం.

**'క్యా బోల్తి పబ్లిక్'కు ప్రాధాన్యం**

సెప్టెంబర్‌లో చేపట్టనున్న 'క్యా బోల్తి పబ్లిక్' కార్యక్రమం సంస్థ రాజకీయ ప్రయాణంలో కీలకంగా మారే అవకాశం ఉంది. గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, మార్కెట్లలో ప్రజలతో నేరుగా మమేకం కావడం ద్వారా స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు సంస్థకు ప్రజల్లో పరిచయం పెరుగుతుంది. అయితే ప్రజల సమస్యలను వినడం మొదటి అడుగు మాత్రమే. వాటికి పరిష్కారాలు చూపించడం తదుపరి దశ. ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకోవడం రాజకీయానికి అవసరం. కానీ ఆ కోరికలను విధానాలుగా మార్చడమే నాయకత్వానికి అసలు పరీక్ష.

**రాష్ట్రాల విస్తరణే రాజకీయ లక్ష్యానికి సంకేతమా?**

వివిధ రాష్ట్రాల్లో కార్యకలాపాలను విస్తరించుకోవడం సంస్థ భవిష్యత్తుపై ఆసక్తిని పెంచుతోంది. అయితే భారతదేశంలో ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకమైన సామాజిక, రాజకీయ సమీకరణాలు ఉంటాయి. ఒక రాష్ట్రంలో పనిచేసిన వ్యూహం మరో రాష్ట్రంలో అదే ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. కాబట్టి రాష్ట్రాల సంఖ్య పెరగడం కంటే స్థానిక నాయకత్వం, బలమైన కేడర్, ప్రజలతో నిరంతర సంబంధం నిర్మించుకోవడం కీలకం. సీజేపీతో సమన్వయం కూడా మరో ఆసక్తికర అంశం. ఇలాంటి సంబంధాలు సంస్థ విస్తరణకు ఉపయోగపడినా.. అదే సమయంలో స్వతంత్ర రాజకీయ గుర్తింపును కాపాడుకోవడం కూడా అవసరం.

**ముఖ్యమంత్రి పదవే లక్ష్యమా?**

ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమైన అధికారిక ప్రకటన లేకపోయినా.. సంస్థ విస్తరణ, ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు, యువతను సమీకరించే ప్రయత్నాలు దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యాలపై ఊహాగానాలకు దారితీస్తున్నాయి. అయితే ముఖ్యమంత్రి పదవిని లక్ష్యంగా పెట్టుకోవడం సులభం. ఆ స్థాయికి చేరుకునే రాజకీయ బలం నిర్మించడం మాత్రం కష్టం. బలమైన కేడర్, స్థానిక నాయకత్వం, ఆర్థిక వనరులు, స్పష్టమైన విధానాలు, ప్రజల విశ్వాసం.. ఇవన్నీ అవసరం.

**తుది తీర్పు ప్రజలదే**

'కాక్రోచ్' ప్రస్తుతం చర్చల్లో ఉండటం ఒక రాజకీయ అవకాశం మాత్రమే. దాన్ని స్థిరమైన ప్రజా మద్దతుగా మార్చుకోవడం అసలు సవాలు. ఉద్యమాలు ఒక సంస్థకు గుర్తింపు తెచ్చిపెట్టవచ్చు. కానీ ఎన్నికలు ఆ సంస్థ సామర్థ్యాన్ని పరీక్షిస్తాయి. ప్రజల సమస్యలను ఎంత నిజాయితీగా అర్థం చేసుకుంటుంది? వాటికి ఎంత సమర్థవంతమైన పరిష్కారాలను చూపిస్తుంది? ప్రజల విశ్వాసాన్ని ఎంతకాలం నిలబెట్టుకుంటుంది? అన్నదే భవిష్యత్తును నిర్ణయిస్తుంది. 'కాక్రోచ్' ఉద్యమ శక్తిగానే మిగులుతుందా? లేక ఎన్నికల రాజకీయాల్లో కొత్త ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందా? సమాధానం రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. కానీ తుది తీర్పు మాత్రం ఎప్పటిలాగే ప్రజలదే.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఏళ్లుగా తేలని లెక్కలు!

**వేలేరు,ఫ్లాష్ ఇండియా :** మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొదుపు సంఘాలు కొందరి తీరుతో వివాదాలకు కేంద్రంగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలేరు మండల కేంద్రంలోని కొన్ని మహిళా సంఘాల్లో రుణాల పంపిణీ, వసూళ్లు, లెక్కల నిర్వహణపై సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘాల ద్వారా అందాల్సిన రుణాలు పక్కదారి పడుతున్నాయని పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు.

**రూ.20 వేల అప్పు.. ఇంకా బకాయేనా?**

2017లో సుమారు రూ.20 వేల రుణం తీసుకున్న కొందరు మహిళలు ఏళ్ల తరబడి నెలనెలా డబ్బులు చెల్లిస్తున్నప్పటి నేటికీ అప్పు తీరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము చెల్లించిన మొత్తాలకు సంబంధించిన పూర్తి లెక్కలు, రుణ ఖాతా వివరాలు స్పష్టంగా తెలియజేయడం లేదని వాపోతున్నారు. సభ్యులకు అందాల్సిన రుణాలను కొందరు ప్రైవేటు వ్యక్తులకు మళ్లిస్తూ ప్రయోజనం పొందుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంఘాలకు రుణాలు మంజూరైన సమయంలో కొంత మొత్తాన్ని కమిషన్ రూపంలో తీసుకుంటున్నారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

**సంఘాల ముసుగులో చిట్టీల దందా?**

పొదుపు సంఘాల కార్యకలాపాలతో పాటు ప్రైవేటుగా చిట్టీలు నిర్వహిస్తూ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సంఘ కార్యకలాపాలు, వ్యక్తిగత ఆర్థిక లావాదేవీల పై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**లెక్కలు తేల్చాల్సిందే..**

సంఘాలకు వచ్చిన నిధులు ఎంత? సభ్యులకు ఎన్ని రుణాలు అందాయి? ఎవరి పేర్లపై రుణాలు మంజూరయ్యాయి? రుణాల చెల్లింపులు ఎలా ఉన్నాయి? సంఘాల బ్యాంకు ఖాతాలు, పుస్తకాలు, సమావేశాల రికార్డులు సక్రమంగా ఉన్నాయా? రుణాల మంజూరులో నిబంధనలు పాటించారా? అనే అంశాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని సభ్యులు కోరుతున్నారు. రుణాల లెక్కలపై స్పష్టత లేకపోవడం, వ్యక్తిగత దందాల ఆరోపణలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కొందరు మహిళలు చెబుతున్నారు. వేలేరు మండలంలోని మహిళా సంఘాల పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని మహిళలు కోరుతున్నారు.

# మెట్రో విస్తరణపై స్పెషల్ ఫోకస్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)పై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రజారవాణా మార్గాలను విస్తరించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే మెట్రో రైలు అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరానికి నలువైపులా మెట్రోరైలును విస్తరించాలని నిర్ణయించింది. అయితే కొన్ని మార్గాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పలు చోట్ల నుంచి విమర్శలు వస-ౢన్నాయి. క్యూర్ పరిధిలోని బోడుప్పల్, పీర్జాదిగుడ, ఘట్ కేసర్ ప్రాంతాల ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఘట్ కేసర్ మార్గంలో అనేక ఐటీ కంపెనీలు వచ్చాయి. ఇప్పటికే ఉన్న మొదటి 69 కిలోమీటర్ల లైన్ తో పాటు ప్రతిపాదిత రెండో దశ 122.9కి.మీగా ఉంది. మరోవైపు వరంగల్, భువనగిరి జిల్లాలకుసంబంధించిన మార్గాల్లోనూ మెట్రోను విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

**రెండోదశలో 122.9కి.మీ**

హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశకు సంబంధించిన డీపీఆర్ లను కేంద్రానికి పంపించారు. ఇందులో నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ.), జేబీఎస్ నుండి మేడ్చల్ (24.5 కి.మీ), జేబీఎస్ నుండి శామీర్‌పేట (22 కి.మీ) మొత్తం 122.6 కి.మీ.ల ప్రతిపాదనలు ఉన్నాయి. మొదటి దశలో మియాపూర్-ఎల్బీనగర్ 29కి.మీ, జేబీఎస్-ఎంజీబీఎస్ 11 కి.మీ, నాగోల్-రాయదుర్గ్ వరకు 29 కి.మీ మొత్తం 69కిలోమీటర్లు ఉంది.

**ఘట్కేసర్ కు 25 కిలోమీటర్లే**

హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశ ఉప్పల్ కేంద్రంగానే ప్రారంభమైంది. అయితే ఎంజీబీఎస్ నుంచి ఉప్పల్ 10కి.మీ, ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వరకు 15కి.మీ.. అంటే ఎంజీబీఎస్ నుంచి ఘట్ కేసర్ వరకు 25కి.మీ మాత్రమే ఉంటుంది. రెండో దశ ప్రతిపాదనల్లో నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు 36కి.మీ వరకు ఉంది. దీంతో పోలిస్తే ఎంజీబీఎస్-ఘట్కేసర్ వరకు 25కిలోమీటర్లు తక్కువగానే ఉందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. దీంతోపాటు మెట్రోరైలుకు సంబంధించిన పార్కింగ్ యార్డు, విద్యుత్ కేంద్రాలు, అన్ని రకాల సౌకర్యాలు ఉప్పల్ కేంద్రంగానే ఉన్నాయి. కానీ ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వరకు మెట్రోరైలును విస్తరించాలని గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆలోచించలేదని పలువురు రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే ఎంజీబీఎస్ నుంచి ఉప్పల్ వరకు కూడా డైరెక్ట్ మెట్రోరైలు మార్గంలేదు. దీన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరంతున్నారు. ఇప్పటికే ఉన్న ఉప్పల్ కేంద్రం నుంచి ఘట్ కేసర్ వరకు మెట్రోను విస్తరిస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆ ప్రాంతాలకు చెందిన నేతలు చెప్తున్నారు. ఇప్పటికే ఈ రూట్ లో పండుగ సమయాల్లో ఊళ్లకు వెళ్లడానికి జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఘట్ కేసర్ వరకు మెట్రోరైలు మార్గం ఉంటే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

# ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం..

## రెడ్‌ఫోర్ట్ నుంచి మెట్రో స్టేషన్ల వరకు నిఘా.. 19 మంది ఉగ్రవాదుల పోస్టర్లు విడుదల..




**న్యూ ఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు, ఖలిస్థానీ మూకల నుంచి ముప్పు ఉండొచ్చన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. ఆకస్మిక నిరసనలు లేదా ఆందోళనలు వేడుకలకు అంతరాయం కలిగించే అవకాశం ఉందన్న అంచనాతోనూ భద్రతను పెంచారు. ఈ క్రమంలో ఇండియన్ ముజాహిదీన్, అల్‌ఖైదా, ఖలిస్థానీ గ్రూపులతో సంబంధం ఉన్నట్లు పేర్కొంటున్న 19 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల ఫొటోలు, పోస్టర్లను ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు ప్రజల సహకారం కూడా తీసుకునేలా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**1,000కు పైగా AI కెమెరాలతో నిఘా**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే రెడ్‌ఫోర్ట్‌తో పాటు కీలక ప్రాంతాల్లో 1,000కు పైగా AI ఆధారిత వీడియో అనలిటిక్స్ కలిగిన జఖఎ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రియల్‌టైమ్‌లో జనసమూహాల కదలికలు, అనుమానాస్పద కార్యకలాపాలను పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. అనుమానాస్పద కదలికలు గుర్తించిన వెంటనే భద్రతా బలగాలు స్పందించేలా నిఘా వ్యవస్థను సిద్ధం చేశారు.

**రెడ్‌ఫోర్ట్ వద్ద బహుళ అంచెల భద్రత**

రెడ్‌ఫోర్ట్ పరిసరాల్లోకి వచ్చే అన్ని ప్రవేశ మార్గాల్లో మల్టీ-లేయర్ సెక్యూరిటీని అమలు చేస్తున్నారు. యాంటీ-సాబోటేజ్ తనిఖీలతో పాటు క్విక్ రియాక్షన్ టీమ్స్ (QRTs)ను మోహరించనున్నారు. వ్యూహాత్మక ప్రాంతాల్లో స్నైపర్లు, భవనాల పైకప్పులపై భద్రతా సిబ్బందిని కూడా ఏర్పాటు చేయనున్నారు. అదనంగా ాఔఊ కమాండోలు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్లు, డాగ్ స్క్వాడ్లను భద్రతా విధుల్లో భాగం చేశారు. రెడ్‌ఫోర్ట్‌కు వచ్చే సందర్శకులు, ఆహ్వానితులను పలు దశల్లో తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించనున్నారు.

**వాహన తనిఖీలు.. నగరమంతా నిఘా**

భద్రతా ప్రాంతాల్లో వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. కీలక ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు రాత్రింబవళ్లు నిఘా కొనసాగించనున్నారు. ప్రభుత్వ భవనాలు, కీలక సంస్థలు, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినల్స్, రవాణా కేంద్రాలు, ఇతర సున్నిత ప్రాంతాల్లోనూ భద్రతను పెంచారు. హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాలపై కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలను గుర్తించేందుకు పోలీసులు, కేంద్ర భద్రతా సంస్థలు, నిఘా విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

**ఆకస్మిక నిరసనలపైనా దృష్టి**

ఉగ్రవాద ముప్పుతో పాటు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జరిగే ఆకస్మిక నిరసనలు, ఆందోళనలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అంతరాయం కలిగించకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. తాజా నిఘా సమాచారాన్ని, ప్రస్తుత ముప్పు పరిస్థితులను అంచనా వేసిన తర్వాతే భద్రతా ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర భద్రతా సంస్థలు, నిఘా విభాగాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అనుమానాస్పద కదలికలపై నిఘా కొనసాగించనున్నారు. ఎలాంటి భద్రతా సవాలు ఎదురైనా వెంటనే స్పందించేలా ఢిల్లీ పోలీస్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా రాజధానిలో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నారు. రెడ్‌ఫోర్ట్ నుంచి కీలక ప్రభుత్వ ప్రాంతాలు, రవాణా కేంద్రాల వరకు విస్తృత నిఘా కొనసాగుతోంది.

# భర్తీలో ఏజెన్సీల మాయాజాలం

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** మామూలుగా ఏదైనా ఉద్యోగ నోటిఫికేషన్ చేయాలనుకుంటే కొన్ని పేరు మోసిన దిన పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం, ఆ ప్రకటన వెలువడిన తర్వాత అర్హత గల అభ్యర్థులు వాటిని చూసి ఆ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవడం సహజం. కానీ, సంగారెడ్డి మెడికల్ కళాశాలలో ఉద్యోగాల నోటిఫికేషన్ ప్రకటన చూస్తే ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. సదరు ఏజెన్సీ లు ఉద్యోగాల భర్తీ కోసం పత్రికా ప్రకటన అంటే ఒక తెల్ల పేపర్ పై ప్రింట్ తీసి దానికి ప్రకటన అని చెప్పుకోవడం సిగ్గుచేటు. ధనార్జనే ధ్యేయంగా ఈ ఉద్యోగాల భర్తీ గత మూడు సంవత్సరాలుగా సాగుతూ వచ్చిందని ఇలాంటివి చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది.

**తెల్ల పేపర్ పై ప్రింట్..**

మెడికల్ కళాశాలలో మూడు సంవత్సరాల కాలంలో ఇప్పటివరకు 180 మందికి పైగా అభ్యర్థులను వివిధ పోస్టులలో ఉద్యోగాల కోసం భర్తీ చేశారు. ముందస్తుగా నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సాగిందనే విమర్శలు ఇప్పటికే సదరు ఏజెన్సీలపై ఉన్నాయి. ఇక వారి చీకటి దందా బయటపడేలా సాక్ష్యంగా తాజాగా ఒక తెల్ల పేపర్ పై పత్రికా ప్రకటన అనే ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వడం చూస్తుంటే అవినీతి ఎలా జరిగిందో ఇట్టే తేటతెల్లమవుతుంది. దీనికి తోడు ఉద్యోగ ప్రకటన అనేది ఎవరికీ కనిపించకుండా ఏజెన్సీలు ఎంతో పకడ్బందీగా ముందే ప్లాన్ వేసుకొని ఊరు పేరు లేని కొన్ని పేపర్లకు ప్రకటన ఇచ్చినట్లు చెబుతూ చేతులు దులుపుకున్నారు. అయితే ఒక్కో పోస్టుకు అభ్యర్థుల నుంచి లక్షల్లో డబ్బులు తీసుకుని ఏజెన్సీలు ముందుండి చక్రం తిప్పితే వారికి అనుకూలంగా కొందరు ఉద్యోగులు వత్తాసు పలకడం.. అందిన కాడికి డబ్బు దోచుకోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఏజెన్సీలపై చర్యలకు అధికారులు మౌనం..**

మెడికల్ కళాశాలలో ఉద్యోగాల భర్తీ అవినీతి అంశంపై సదరు ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడంలో జిల్లా స్థాయి అధికారులు మౌనం ప్రదర్శిస్తున్నారు. ఈ ఉద్యోగ ప్రక్రియ అంశంలో ఉన్నతాధికారులు పూర్తిస్థాయి నివేదికను తీసుకొని అవినీతికి పాల్పడ్డ ఏజెన్సీలను రద్దు చేయాలని సర్వత్రా డిమాండ్ పెరుగుతోంది. దీంతోపాటు ఏజెన్సీలకు సహకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఉద్యోగులపై కూడా వేటు వేయాలని పలువురు కోరంతున్నారు. అర్హులైన అభ్యర్థులను కాకుండా డబ్బులు ఇచ్చిన వారికే మొదటి ప్రాధాన్యతగా ఉద్యోగ భర్తీ ప్రక్రియ కొనసాగడంపై విమర్శలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి.

**డబ్బు వసూల్లే ఏజెన్సీల ప్రధాన ఎజెండా..**

మెడికల్ కళాశాలలో గడిచిన మూడు సంవత్సరాలుగా ఇప్పటివరకు శ్రీసువర్ణ, విజయేంద్ర, లక్ష్మీ వెంకటేశ్వర, భగవతి, దిశా అనే ఐదు ఏజెన్సీల ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామక భర్తీ ప్రక్రియ కొనసాగుతూ వచ్చింది. ఒక్కో పోస్టుకు రూ.2 నుంచి 3 లక్షల వరకు సదరు అభ్యర్థి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఏజెన్సీ నిర్వాహకులు డబ్బుల వసూళ్ల దందానే తమ ప్రధాన అజెండాగా పెట్టుకొని ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగించిందనే ఆరోపణలు ఉన్నాయి. నోటిఫికేషన్ లేకుండానే ఉద్యోగాల భర్తీ చేయడం ఇందుకు ఒక నిదర్శనం. తాజాగా పత్రికా ప్రకటనల పేరిట తెల్ల కాగితాలపై ప్రింట్ తీసి ఇవ్వడం, ఊరు పేరు లేని కొన్ని మీడియా పేరు మీద ఎడిట్ చేసిన వాటిని అవే పత్రిక ప్రకటన ఉద్యోగ నోటిఫికేషన్ అంటూ ఫైల్ చేయడం చూస్తుంటే వారి అవినీతి నిజమేనని స్పష్టమవుతుంది.

**సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తప్పనిసరి..**

ప్రస్తుతం ఏజెన్సీల ద్వారా నియామకం పొందిన ఉద్యోగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తే అసలు సంగతి ఏమిటి అనేది బయట పడే అవకాశం ఉంది. ఉద్యోగంలో ఉన్న వ్యక్తి సరైన అర్హుడా..? లేక అనర్హుడా..? అనే విషయాలు బయటకు వస్తాయి. ఇక్కడ ఉద్యోగాల కోసం ఎంతో ఆశగా ఎదురుచూసిన అసలైన అభ్యర్థులకు మొండి చేయి చూపి డబ్బులు ఇచ్చిన వారికే ఉద్యోగాల్లో భర్తీ చేయడం ప్రజాక్షేత్రంలో న్యాయం కాదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# భారీగా నాణేలు స్వాధీనం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా వెండి నాణేలు పట్టుబడ్డాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు వచ్చిన ఒక ప్రయాణికుడి వద్ద భద్రతా సిబ్బంది 7 కిలోల వెండి నాణేలను స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయంలోని చెకింగ్ పాయింట్ వద్ద ప్రయాణికులను, వారి లగేజీని తనిఖీ చేస్తుండగా కేంద్రీయ పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది ఈ వెండి నాణేలను గుర్తించారు. లగేజీ బ్యాగులో ఎలాంటి బిల్లులు లేకుండా భారీ మొత్తంలో వెండి నాణేలను తరలిస్తుండటంతో అధికారులు తక్షణమే సదరు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నాణేలకు సంబంధించిన రసీదులు, బిల్లులు, ఇతర కొనుగోలు పత్రాలపై సీఐఎస్ఎఫ్ అధికారులు ఆ ప్రయాణికుడిని సుదీర్ఘంగా విచారిస్తున్నారు. వెండి నాణేల లెక్కింపు, వాటి విలువ, ఈ రవాణా వెనుక ఉన్న వివరాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యల కోసం కస్టమ్స్ లేదా ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది.

# డీల్ కుదిరాక పోలీసుల ట్విస్ట్!

**మహారాష్ట్ర :** దేశంలో నకిలీ కరెన్సీ రూపుమాపేందుకు ప్రభుత్వం, ఆర్‌బీఐ రకరకాల ప్రయత్నాలు చేస్తుంటే మరో వైపు కేటుగాళ్లు మాత్రం ఫేక్ కరెన్సీని మార్కెట్లోకి వెదజల్లుతూనే ఉన్నారు. తాజాగా భారీగా నకిలీ నోట్లు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్రలోని ముంబై పరిధిలో ఉన్న విరార్ ప్రాంతంలో ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై కారులో తరలిస్తున్న దాదాపు రూ.1 కోటి విలువైన నకిలీ కరెన్సీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**రూ.30 లక్షలిస్తే కోటి ఫేక్ కరెన్సీ:**

పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు హైవేపై వెళ్తున్న ఒక అనుమానాస్పద కారును తనిఖీ చేశారు. కారులో తనిఖీలు చేపట్టగా అందులో కోటి విలువ చేసే రూ. 500 నకిలీ నోట్ల కట్టలను గుర్తించారు. అయితే రూ. 30 లక్షల అసలు నోట్లు ఇస్తే రూ. 1 కోటి నకిలీ నోట్లు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని ఈ ఒప్పందంలో భాగంగానే ఫేక్ కరెన్సీ తరలిస్తున్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనకు సంబంధించి మహారాష్ట్రలోని కోపర్‌గావ్ ప్రాంతానికి చెందిన ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కారుతో పాటు నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ నకిలీ నోట్ల నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు మాస్టర్‌మైండ్ ఎవరు? వీటిని ఎక్కడి నుంచి ముద్రిస్తున్నారు? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

# కవలల మృతదేహాల్లో ఒకటి మిస్సింగ్



**పంజాగుట్ట,ఫ్లాష్ ఇండియా :** పంజాగుట్ట స్మశానవాటికలో దారుణ ఘటన వెలుగుచూసింది. స్మశానవాటికలో ఖననం చేసిన శిశువు మృతదేహం అదృశ్యమయింది. చార్మినార్ ఝాన్సీ బజార్ కు చెందిన దంపతులకు ఆరునెలల క్రితం కవలలు పుట్టారు. సదరు మహిళకు నెలలు నిండకుండానే కవలలకు జన్మనివ్వగా.. ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. దీంతో బంజారాహిల్స్ లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. నాలుగు రోజుల క్రితం (శనివారం) ఒక శిశువు మృతి చెందగా.. పంజాగుట్ట స్మశానవాటికలో ఖననం చేశారు. ఆదివారం మరో శిశువు కూడా మరణించడంతో.. ఆ మృతదేహాన్నీ అక్కడే ఖననం చేసేందుకు వెళ్లగా.. ముందుగా పూడ్చి పెట్టిన శిశువు మృతదేహం అదృశ్యమైనట్లు కనిపించింది. శిశువును పూడ్చిన గొయ్యి తవ్వి ఖాళీగా ఉండటంతో శిశువును ఎవరో తీసుకెళ్లినట్లు గుర్తించారు. మృతదేహం ఏమైందని శ్మశాన వాటి సిబ్బందిని ప్రశ్నించగా.. వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో బాధిత తల్లిదండ్రులు బంజారాహిల్స్ పోలీసుల్ని ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కాటికాపరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

# సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌పై కేసు నమోదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రముఖ గాయకుడు, బిగ్‌బాస్ విజేత రాహుల్ సిప్లిగంజ్ మరో వివాదంలో చిక్కుకున్నారు. ఆయనతో పాటు మరో మరో 15 మందిపై విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాహుల్ సిప్లిగంజ్ బావమరిది పెళ్లి పేరుతో తనను మోసం చేశాడని ఒక యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా ఎంవీపీ కాలనీ పోలీసులు దీనిని మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

**పెళ్లి పేరుతో మోసం ఆరోపణ:**

రాహుల్ సిప్లిగంజ్ బావమరిది కర్వ్వారపు రాహుల్ రెడ్డి తనను వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగదీసుకుని మోసం చేశాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. మోసం చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడటం, పరువు నష్టం కలిగించడం, దొంగతనం చేయడంతో పాటు తన ప్రాణాలకు హాని తలపెట్టేందుకు యత్నిస్తున్నాడని తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ వ్యవహారంలో రాహుల్ సిప్లిగంజ్, రాహుల్ రెడ్డిలతో పాటు అడ్వకేట్, జర్నలిస్టుల పేర్లు సైతం ఎఫ్ఐఆర్ లో చేర్చినట్లు తెలుస్తోంది.

**గతంలోనే కేసు తాజాగా వెలుగులోకి:**

కాగా, బాధితురాలు గతంలో (2026 మార్చి 10న) కేవలం రాహుల్ రెడ్డిపై మాత్రమే సిటీ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. కానీ, మూడు నెలల విరామం తర్వాత జూన్ 11న సడన్‌గా మరో 11 మంది పేర్లను చేర్చుతూ రెండో ఫిర్యాదు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తవ-ౣవుతున్నాయి. రాహుల్ రెడ్డి నుంచి బాధితురాలు కోరిన రూ. కోటి డిమాండ్ నెరవేరకపోవడంతోనే ప్రముఖుల పేర్లను చేర్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రకంగా నిందితుల సంఖ్య సడన్‌గా పెరగడం ప్రస్తుతం పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది



# ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం అత్యంత ప్రాచీనమైన,ఆరోగ్యకరమైన విషయం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వర్షాకాలం ఆరంభంలో వచ్చే ఈ మాసంలో వాతావరణ మార్పుల వల్ల శరీరంలో చేరే ఉష్ణాన్ని వాత దోషాల్ని తగ్గించడానికి గోరింటాకు అద్భుతంగా పనిచేస్తుందిమహిళలు సౌభాగ్యానికి ప్రతీకగా దీని చేతులకు పెట్టుకుంటారు.నల్గొండ పట్టణంలోని 33 వ వార్డు ఓల్డ్ వీటీ కాలనీలో ఆషాడ మాసం సందర్భంగా మహిళలంతా గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. అందరూ ఒక్క దగ్గర చేరి గౌరమ్మకు పూజలు చేసిన అనంతరం గోరింటాకు పెట్టుకున్నారు. ఈకార్యక్రమంలోకుంభంజ్యోతి,ఉమా,విజయ,సరిత మంజుల,ఉమా,శోభ,సునీత,ఉమా,వినోద,మంగ,లావణ్య,వినోద,పద్మ, జయశ్రీ,,శ్వేత,ఝాన్సీ,నీరజ, అనిత తతిధర కాలనీవాసులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు కల్పించాలి





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రోగులకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.మంగళవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ముందుగా ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషెంట్ (IP) వార్డును పరిశీలించిన కలెక్టర్, ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విధులకు హాజరైన సిబ్బంది వివరాలతో పాటు గైర్హాజరైన సిబ్బంది వివరాల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు అందించే సమయంలో సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు.ఆరోగ్య కేంద్రం పరిసరాలు, వార్డులు, రోగులు వేచి ఉండే ప్రదేశాలు, ఇతర గదుల్లోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత అత్యంత ముఖ్యమైన అంశమని, రోగులకు చికిత్స అందించే ప్రదేశం అన్ని వేళలా శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలని స్పష్టం చేశారు.ఆరోగ్య కేంద్రం ఆవరణతో పాటు అన్ని విభాగాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని, ఎక్కడా చెత్త, దుమ్ము, అపరిశుభ్రత కనిపించకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. అనంతరం టీకాల గది, ప్రయోగశాల (ల్యాబ్), ఫార్మసీలను కలెక్టర్ తనిఖీ చేశారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, రోగులకు టెస్ట్ రిపోర్టులు అందజేస్తున్న విధానం గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పూర్తయిన అనంతరం రోగులకు రిపోర్టులు నిర్ణీత సమయంలో అందేలా చూడాలని సూచించారు.ఫార్మసీలో మందుల నిల్వలు, అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలను తనిఖీ చేశారు. మందుల వినియోగంలో FIFO (First In -- First Out) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని, ముందుగా వచ్చిన మందులను ముందుగా వినియోగించేలా స్టాక్ నిర్వహణ చేయాలని ఆదేశించారు. గడువు తేదీలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, మందుల నిల్వలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఆరోగ్య కేంద్రంలో నీటి సరఫరా పరిస్థితిని కలెక్టర్ పరిశీలించి, ప్రస్తుతం ఉన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో అవసరమైన నీటి సరఫరా శనివారం నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆరోగ్య కేంద్రం ప్రాంగణం, నీటి నిల్వ ప్రదేశాలు, టాయిలెట్లు, వార్డులు, ల్యాబ్, ఫార్మసీ, తదితర అన్ని విభాగాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, మందుల లభ్యత, నీటి సరఫరా వంటి అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు.ఈ తనిఖీలో వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది, సర్పంచి, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, హెరాయిన్ పట్టివేత..



**శేరిలింగంపల్లి,ఫ్లాష్ ఇండియా :** రాయదుర్గం మధుర నగర్, పోచమ్మ గుడి సమీపంలో నార్సింగ్ ఎస్ఓటి రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఒక పెడ్లర్, ఇద్దరు వినియోగదారులను అరెస్ట్ చేసినట్లు ఇన్స్పెక్టర్ భూపతి తెలిపారు. బీహార్‌కు చెందిన హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్, మిల్తిలేష్ యాదవ్ కుమారుడు కృష్ణ కుమార్ (23) వద్ద 2.8 కిలోగ్రాముల ఎండు గంజాయి, 6 గ్రాముల హెరాయిన్ ఉన్న నీలి రంగు సఫారీ బ్యాగ్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. బీహార్‌కు చెందిన కూలీలైన రోషన్ (30) అభిషేక్ కుమార్ (22) ఇద్దరు వ్యక్తులు అక్కడికి రాగా అరెస్ట్ చేశారు. వారి మూత్ర పరీక్షలు చేయగా మాదకద్రవ్యాలు వాడినట్లు నిర్ధారణ అయింది.బీహార్ రాష్ట్రానికి చెందిన బంటీ కుమార్, అమర్ కుమార్ అనే ఇద్దరు అప్‌స్ట్రీమ్ సరఫరాదారులు పరారీలో ఉన్నారు.

# పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక దృష్టి





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మంగళవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, ఏకరూప దుస్తుల పంపిణీ, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన స్థాయి, పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరిశీలించారు.5వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? అని హెడ్ మాస్టర్‌ను అడుగగా, 13 మంది విద్యార్థులు ఉన్నట్లు కలెక్టర్ కు వివరించారు. అదే విధంగా పాఠశాలలో మొత్తం 45 మంది విద్యార్థులు ఉన్నట్లు హెడ్ మాస్టర్ ను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, తరగతి గదుల్లో బోధనా విధానం పర్యవేక్షించి, పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు అందాయా? అని ఉపాధ్యాయులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.అసంపూర్తిగా ఉన్న పాఠశాల అదనపు తరగతి గదుల భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, గోడలు, విద్యుత్, తలుపుల ఏర్పాటు, ప్లాస్టరింగ్ వంటి నిర్మాణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.పాఠశాలలోని తరగతి గదిలోనే వంట చేస్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుకునే తరగతి గదులను వంట కోసం వినియోగించడం సరికాదని తెలిపారు. మధ్యాహ్న భోజనం కోసం ఏర్పాటు చేసిన వంట గదిలోనే వంట చేయాలని ఆదేశించారు.వంట సమయంలో పొగ, వేడి, ఆహార పదార్థాల వల్ల తరగతి గదులు అపరిశుభ్రంగా మారడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుతూ, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల ఆవరణ, టాయిలెట్స్, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్త, వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని అదేశించారు.ఈ పరిశీలనలో హెడ్ మాస్టర్ జాన్, సర్పంచి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న...




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే సూక్తిని సిస్టర్లు తమ నిరంతర సేవలతో నిజం చేస్తున్నారని బిషప్ థమన్ కుమార్,జీఆర్ఐ ప్రెసిడెంట్ ఫాదర్ బాలశౌరి లు కొనియాడారు.ఇదే స్ఫూర్తి తో మరిన్ని ఉన్నతమైన సేవలు అందాలని ఆకాంక్షించారు.నల్లగొండ పరిసర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నిరుపేదలకు,ఆపన్నులకు నిరంతర సేవలందిస్తున్న స్థానిక కాథలిక్ సిస్టర్స్ మఠం ఒక అరుదైన, చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది.ఈ కాంగ్రిగేషన్‌కు అత్యున్నత చట్టబద్ధమైన స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే సుయి జురిస్ హోదా దక్కింది.ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం నల్లగొండ డైసీస్ పరిధిలోని గంధంవారి గూడెంలో ప్రత్యేక కృతజ్ఞతా బలిపూజ, అభినందన సభను అత్యంత వైభవంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రంలోనే ఒక స్థానిక సేవా సంస్థకు ఇలాంటి అత్యున్నత స్వతంత్ర సుయి జురిస్ హోదా రావడం ఇదే మొట్టమొదటిసారి కావడం విశేషం.ఇది యావత్ తెలంగాణ క్రైస్తవ సమాజానికే ఒక గొప్ప వరమని సభలో పాల్గొన్న పెద్దలు కొనియాడారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు నల్లగొండ పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ డాక్టర్ జోజి తుమ్మ ముఖ్య అతిథిగా విచ్చేసి దివ్యబలిపూజను సమర్పించారు.సంస్థ ప్రెసిడెంట్ మదర్ మేరీ జెనెట్ సుయి జురిస్ అధికారిక పత్రాన్నిచదివి వినిపించగా,సుపీరియర్ మదర్ మేరీ ఫిలిప్ ఆ పత్రాన్ని బిషప్ థమన్ కుమార్ కు అందజేశారు.ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా నల్లగొండ జిల్లాలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో మరిన్ని ఉన్నతమైన సేవలు అందాలని ఆకాంక్షించారు.అలాగే సుపీరియర్ జనరల్ మదర్ జేన్ కే వర్గీస్ సిస్టర్లందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమానికి హాజరైన జీఆర్ఐ ప్రెసిడెంట్ ఫాదర్ బాలశౌరి మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే సూక్తిని సిస్టర్లు తమ నిరంతర సేవలతో నిజం చేస్తున్నారని కొనియాడారు. ఏపీసీసీ రాష్ట్ర పొలిటికల్ జనరల్ సెక్రటరీ పసల శౌరయ్య ముఖ్య అతిథిగా హాజరై సిస్టర్ల నిస్వార్థ సేవలను ప్రశంసిస్తూ సంస్థ పెద్దలను ఘనంగా సత్కరించారు.మేనేజింగ్ కమిటీ ప్రతినిధి గోవిందరెడ్డి మాట్లాడుతూ సిస్టర్ల సేవా పరిధి భవిష్యత్తులో మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకలో అల్ఫోన్సస్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ హృదయ్ కుమార్ రెడ్డి, లిటిల్ ఫ్లవర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సిస్టర్ వసంత,చాన్స్ లర్ ఫాదర్ అట్ల రెడ్డి,కేథడ్రల్ పారిష్ ప్రీస్ట్ ఫాదర్ బాలస్వామి మరియు ఫాదర్ మైఖేల్,ఫాదర్ ఇన్నయ్య, ఫాదర్ బాలరాజు,ఫాదర్ జూలియన్ తదితర గురువులు,సిస్టర్లు,పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొని సిస్టర్లను అభినందించారు.

# చెత్తకు నిప్పు.. దట్టమైన పొగ..



**షాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఒలెక్ట్రా కంపెనీ నుంచి వెలువడుతున్న చెత్తను తరలించే వారు నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా డంపింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తను ప్రధాన రహదారి సమీపంలో పడేసి నిప్పు పెట్టడంతో భారీగా మంటలు చెలరేగి, దట్టమైన పొగ, దుర్వాసన పరిసర ప్రాంతాలను కమ్మేస్తున్నాయి. ప్రధాన రహదారి పక్కనే చెత్తను కాల్చడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దట్టమైన పొగ కారణంగా రహదారి సరిగా కనిపించక ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో పనిచేస్తున్న రైతులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు.చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడమే కాకుండా, నిప్పు పెట్టి బహిరంగంగా కాల్చడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బాధ్యత కలిగిన అధికారులు ఇలాంటి ఘటనలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా చెత్త డంపింగ్ చేయడం, బహిరంగంగా కాల్చడాన్ని అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారి పక్కన చెత్త కాల్చకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



# పప్పు దినుసు పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలి

**హనుమకొండ ,ఫ్లాష్ ఇండియా :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్ ( పప్పు దినుసుల సాగులో స్వయం సమృద్ధి సాధించడం పై ) వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా పప్పు దినుసుల పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ని కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్ ( పప్పు దినుసుల సాగులో స్వయం సమృద్ధి సాధించడం)పై వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లో ఎరువులు విత్తనాల నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా విస్తృత తనిఖీలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతు బీమా క్లెయిమ్ లను త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతు నమోదు( ఫార్మర్ రిజిస్ట్రీ) అందరూ రైతులు నమోదు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 87.8 శాతం నమోదు పూర్తయిందని, మిగతా నమోదును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, సహాయ సంచాలకులు ఆదిరెడ్డి, అవినాష్ వర్మ, సాంకేతిక వ్యవసాయ అధికారి కమలాకర్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట,ఫ్లాష్ ఇండియా :** దామరగిద్ద మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం పరిశీలించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయం పక్కన ఉన్న భవనంలో 2019 సంవత్సరం నుంచి సీజన్‌వారీగా మహిళా సమాఖ్య సభ్యులు సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నట్లు డీపీఎం జయన్న కలెక్టర్‌కు వివరించారు. యూనిట్ ద్వారా వచ్చిన లాభాలు, మహిళలకు కల్పించిన ఉపాధి అవకాశాలతో పాటు యూనిట్‌లో తయారు చేసిన సీతాఫలం గుజ్జును విదేశాలకు సైతం ఎగుమతి చేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ప్రస్తుత సీజన్‌లో కూడా సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న భవనంలో సీతాఫలాలను నిల్వ చేసేందుకు, అవసరమైన ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసేందుకు స్థలం సరిపోవడం లేదని మహిళా సమాఖ్య సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. యూనిట్ నిర్వహణకు అనువుగా పెద్ద గోదాం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. దీనిపై తహసీల్దార్ తిరుపతయ్య మాట్లాడుతూ.. మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు కలెక్టర్‌కు తెలిపారు. వీలైనంత త్వరగా ఆ స్థలాన్ని సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అదేవిధంగా వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా అనువైన స్థలాన్ని కేటాయించాలని సూచించారు. స్థలం కేటాయించే వరకు ప్రస్తుత సీజన్‌లో ఉన్న భవనంలోనే సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగించాలని మహిళా సమాఖ్య సభ్యులకు కలెక్టర్ సూచించారు.



# మూడోసారి వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్‌కు వెస్టిండీస్

ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027 పోటీలకు ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు నేరుగా అర్హత సాధించగా, రెండుసార్లు మాజీ ఛాంపియన్ అయిన వెస్టిండీస్ మరోసారి క్వాలిఫైయర్స్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరల్డ్ కప్‌లో ఆటోమేటిక్ అర్హత సాధించడానికి ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలవాల్సి ఉంటుంది (హోస్ట్ దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వే మినహా). బెల్ఫాస్ట్‌లో ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో గెలుపొందడంతో ఆఫ్ఘనిస్థాన్ తమ డైరెక్ట్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. దీంతో ఆస్ట్రేలియా, ఇండియా, న్యూజిలాండ్, పాకిస్తాన్, శ్రీలంక, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్, సౌతాఫ్రికా, జింబాబ్వే తో పాటు ఆఫ్ఘనిస్థాన్ కూడా డైరెక్ట్ ఎంట్రీ సాధించింది. వన్డే ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంలో ఉన్న వెస్టిండీస్, కటాఫ్ తేదీకి ముందు భారత్‌తో మరో రెండు వన్డేలు ఆడాల్సి ఉన్నప్పటికీ, ఆ మ్యాచ్‌ల్లో గెలిచినా ఆటోమేటిక్ అర్హత సాధించడం సాధ్యపడదని స్పష్టమైంది. దీంతో విండీస్ వరుసగా మూడోసారి వరల్డ్ కప్ క్వాలిఫైయర్ రౌండ్‌లో పోరాడక తప్పడం లేదు. 2023 ప్రపంచకప్‌నకు కూడా నేరుగా అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్, క్వాలిఫైయర్స్‌లో వైఫల్యం చెంది మొదటిసారి వన్డే ప్రపంచకప్ లో ఆడే అవకాశాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే క్వాలిఫైయర్స్ టోర్నీ ద్వారానే విండీస్ తమ ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

# టీమిండియా టెస్ట్ టీమ్ కోసం మేం ముగ్గురం ఎంతో కష్టపడ్డాం!



భారత బ్యాటర్ అజింక్య రహానే ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. టెస్టు క్రికెట్‌లో విదేశీ పర్యటనల్లో భారత జట్టుకు కీలక ఆటగాడిగా నిలిచిన రహానే.. స్వింగ్, పేస్‌కు అనుకూలమైన పిచ్‌లపై అద్భుతంగా బ్యాటింగ్ చేసేవాడు. జట్టుకు అవసరమైన సమయంలో కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం రహానేకి పలువురు మాజీ, ప్రస్తుత స్టార్ క్రికెటర్ల నుంచి ఫోన్ కాల్స్, సందేశాలు వచ్చాయి. వారందరికీ జింక్స్ ఒకటే సమాధానం చెప్పాడట. రిటైర్మెంట్ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొద్దిసేపటికే భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నుంచి తొలి ఫోన్ కాల్ వచ్చినట్లు అజింక్య రహానే వెల్లడించాడు. 'రహానే.. నువ్ ఇంకా ఎక్కువ కాలం అంతర్జాతీయ క్రికెట్ ఆడతావు అనుకున్నా' అని సచిన్ చెప్పినట్లు తెలిపాడు. ఇకపై క్రికెట్‌ను సాగదీయకుండా, ఎలాంటి అసంతృప్తి లేకుండా కెరీర్‌ను ముగించాలనే నిర్ణయం తీసుకున్నానని సచిన్‌కు రహానే చెప్పాడట. సచిన్‌తో పాటు మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కూడా రహానేకి ఫోన్ చేసి మాట్లాడారు. మరోవైపు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, చతేశ్వర్ పుజారా వంటి ఆటగాళ్లు రహానేకి మెసేజెస్ అండ్ కాల్స్ చేశారు. అయితే వీరందరికీ రహానే ఒకటే సమాధానం ఇచ్చినట్లు తెలిపాడు. క్రికెట్‌కు తాను పూర్తిగా న్యాయం చేశాననే సంతృప్తితో ఉన్నానని, తన నిర్ణయంపై ఎలాంటి పశ్చాత్తాపం లేదని స్పష్టం చేసినట్లు వెల్లడించాడు. రిటైర్మెంట్ వీడియోను రికార్డ్ చేసే సమయంలో తాను తీవ్రంగా భావోద్వేగానికి గురయ్యానని రహానే చెప్పాడు. కుటుంబ సభ్యులతో రిటైర్మెంట్ గురించి మాట్లాడుతున్న సమయంలోనే భావోద్వేగానికి లోనయ్యానని, అయితే వీడియో రికార్డింగ్ సమయంలో అది మరింత ఎక్కువైందని తెలిపాడు. ఎన్నో సంవత్సరాలుగా తాను ఎంతో ఇష్టంగా చేసిన క్రికెట్‌ను ఇకపై ఆడబోననే విషయం తనను కదిలించిందని రహానే పేర్కొన్నారు. పుజారా, కోహ్లీతో తన అనుబంధం గురించి కూడా జింక్స్ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పుజారాతో కలిసి దేశవాళీ క్రికెట్‌లో చాలా కాలం ఆడానని, విరాట్‌తో మాత్రం భారత జట్టు తరఫున ఎక్కువ సమయం గడిపానని చెప్పాడు. తమ మధ్య మంచి స్నేహబంధం ఉండేదని, భారత టెస్టు జట్టును అత్యున్నత సాధ్యికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ముగ్గురూ కలిసి పనిచేశామని చెప్పుకొచ్చాడు. 2015లో భారత్ టెస్టు ర్యాంకింగ్స్‌లో 6-7 స్థానంలో ఉన్న సమయంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నామని, ఆ తర్వాత క్రమంగా ప్రపంచ నంబర్‌వన్ టెస్టు జట్టుగా ఎదిగామని రహానే గుర్తుచేసుకున్నారు. ఆటపై చర్చించడం, విశ్లేషించడం, ఒకరి నుంచి మరొకరు నేర్చుకోవడం తమ బంధాన్ని మరింత బలపరిచిందని చెప్పారు. చివరకు భారత జట్టు టెస్టు క్రికెట్‌లో అగ్రస్థానానికి చేరుకునే ప్రయాణంలో భాగస్వాములుగా ఉండటం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని రహానే పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనంతరం తనను పలకరించిన సచిన్, కోహ్లీ, రోహిత్, బుమ్రా తదితరులకు రహానే ఇచ్చిన సమాధానం ఆయన కెరీర్‌పై ఉన్న సంతృప్తిని స్పష్టం చేస్తోంది.



# బెస్ట్ బౌలర్‌గా విరాట్ కోహ్లీ..

ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్, పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) ఆటగాడు మార్కస్ స్టోయినిస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ అభిమానులను షాక్‌కు గురిచేస్తోంది. రికార్డుల రారాజు, రన్ మెషిన్ విరాట్ కోహ్లీని బౌలర్‌గా ఎంచుకున్నాడు. సాధారణంగా బ్యాటింగ్ దిగ్గజంగా గుర్తింపు పొందిన కోహ్లీని.. స్టోయినిస్ తన 'బ్యాక్‌యార్డ్ క్రికెట్' జట్టులో బౌలర్‌గా ఎంచుకున్నాడు. ఈ ఎంపిక వినడానికి కాస్త ఆశ్చర్యంగా అనిపించినా.. దాని వెనుక స్టోయినిస్ చెప్పిన కారణం మాత్రం ఆసక్తికరంగా ఉంది.

**బౌలర్‌గా ఎందుకు ఎంచుకున్నాడంటే?:**

బ్యాక్‌యార్డ్ క్రికెట్‌లో బౌలింగ్ చేయడానికి విరాట్ కోహ్లీ సరైన ఆటగాడని మార్కస్ స్టోయినిస్ అభిప్రాయపడ్డాడు. 'విరాట్ కోహ్లీ బౌలింగ్‌ను ఎక్కువ మంది బ్యాటర్లు పెద్దగా పట్టించుకోరు. అందువల్ల అతడి బంతులు బ్యాటర్లను ఆశ్చర్యపరచవచ్చు. ముఖ్యంగా కోహ్లీ బౌలింగ్ శైలి కాస్త ఇబ్బందికరంగా ఉంటుంది. ఆ బౌలింగ్ శైలి బ్యాటర్లను తికమక పెట్టే అవకాశం ఉంటుంది. నా జట్టులో కోహ్లీనే బౌలర్‌గా తీసుకుంటాను. బ్యాక్‌యార్డ్ క్రికెట్‌లో అతడి బౌలింగ్ చాలా ఇబ్బందికరంగా ఉంటుందని అనుకుంటున్నాను' అని స్టార్ స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానల్‌లో స్టోయినిస్ వెల్లడించాడు. స్టోయినిస్ వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అయ్యాయి.

**కోహ్లీ బౌలింగ్‌లోనూ వికెట్లు తీశాడు:**

విరాట్ కోహ్లీ ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడు. అయితే అతడు అప్పుడప్పుడు బౌలింగ్ కూడా చేశాడు. మీడియం పేస్ బౌలింగ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో వికెట్లు కూడా సాధించాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 152 బంతులు వేసిన కోహ్లీ.. నాలుగు వికెట్లు తీశాడు. వన్డేల్లోనూ ఐదు వికెట్లు ఖాతాలో ఉన్నాయి. అయితే టెస్టు క్రికెట్‌లో మాత్రం ఒక్క వికెట్ కూడా పడగొట్టలేదు. భారత జట్టుతో పాటు దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ తరఫున కూడా కోహ్లీ అప్పుడప్పుడు బౌలింగ్ చేసి వికెట్లు తీశాడు.

**2023లో చివరిసారిగా బౌలింగ్:**

అంతర్జాతీయ క్రికెట్‌లో విరాట్ కోహ్లీ చివరిసారిగా 2023 వన్డే ప్రపంచ కప్‌లో బౌలింగ్ చేశాడు. నెదర్లాండ్స్‌తో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బంతిని అందుకున్న కోహ్లీ.. డచ్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్‌ను ఔట్ చేశాడు. కేఎల్ రాహుల్ క్యాచ్ పట్టడంతో కోహ్లీ చాలా కాలం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో వికెట్ సాధించాడు. అంతకుముందు కూడా కోహ్లీ తన పార్ట్‌టైమ్ బౌలింగ్‌తో కీలక సమయాల్లో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. అందుకే బ్యాక్‌యార్డ్ క్రికెట్‌లో అతడిని 'మిస్టరీ బౌలర్'గా ఉపయోగించవచ్చని మార్కస్ స్టోయినిస్ భావించాడు.

ఐపీఎల్‌లోనూ కోహ్లీకి వికెట్లు:

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున కూడా విరాట్ కోహ్లీ బౌలింగ్ చేశాడు. ఇప్పటివరకు ఐపీఎల్‌లో అతడి ఖాతాలో నాలుగు వికెట్లు ఉన్నాయి. 2016లో గుజరాత్ లయన్స్‌పై 2/25తో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. అయితే ఆ తర్వాత చాలా కాలం పాటు ఆర్సీబీ తరఫున కోహ్లీ బౌలింగ్ చేయలేదు. కోహ్లీ కెరీర్‌లో చెప్పుకోదగ్గ రికార్డు లేకపోయినా.. అవసరమైన సమయంలో బంతిని అందుకుని ప్రత్యర్థులకు షాక్ ఇచ్చాడు.

**వన్డేల్లో కొనసాగుతున్న కోహ్లీ:**

విరాట్ కోహ్లీ ఇప్పటికే టెస్టు, టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో మాత్రమే భారత జట్టుకు అందుబాటులో ఉన్నాడు. రాబోయే వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో టీమిండియా తరఫున కింగ్ బరిలోకి దిగే అవకాశం ఉంది. మొత్తానికి.. ప్రపంచ స్థాయి బ్యాటర్ అయిన కోహ్లీని బౌలర్‌గా ఎంచుకోవడం వెనుక స్టోయినిస్ చెప్పిన కారణం మాత్రం క్రికెట్ అభిమానులను షాక్‌కు గురిచేస్తోంది. సాధారణంగా కోహ్లీ బ్యాటింగ్ గురించి మాత్రమే మాట్లాడే సమయంలో.. పార్ట్‌టైమ్ బౌలింగ్‌ను గుర్తుచేసిన స్టోయినిస్ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి.


# బిజినెస్



## దూసుకెళ్లిన పసిడి, వెండి ధరలు

గత కొద్ది రోజులుగా స్వల్పంగా పెరుగుతూ, తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు ఈ రోజు(మంగళవారం) ఊహించని షాక్ ఇచ్చాయి. ఆషాడ మాసం ముగియడం, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం (ఆగస్టు 11, 2026) బంగారం, వెండి ధరలు భారీగా పెరిగి సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారం ధర ఒక్కరోజే ఏకంగా రూ.3,160 పెరిగి రూ.1,55,130 మార్కుకు చేరింది. అలాగే ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.2,900 మేర ఎగబాకి రూ.1,42,200గా పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాలు, రూపాయి విలువ క్షీణత, గ్లోబల్ మార్కెట్ పరిస్థితుల ప్రభావంతోనే పసిడి ధరలు ఈ స్థాయిలో హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు పసిడి బాటలోనే వెండి ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో కేజీ వెండి ధర ఒక్కరోజే రూ.10,000 మేర భారీగా పెరిగి రూ.2,60,000 మార్కును తాకింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, పట్టణాలను బట్టి ఈ స్థానిక పసిడి, వెండి ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉందని వర్తకులు తెలిపారు. అలాగే బులియన్ మార్కెట్‌లో వెల్లడించిన ఈ ప్రామాణిక ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ మరియు మేకింగ్ చార్జీలు వర్తిస్తాయని కొనుగోలుదారులు గమనించాలని సూచించారు.

## త్వరలో యాపిల్ పే సేవలు షురూ




భారత్‌లో డిజిటల్ చెల్లింపుల మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం, సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాపిల్ పేను భారత్‌లో ప్రారంభించే అవకాశాలపై కంపెనీ పనిచేస్తోంది. తొలి దశలో కంపెనీ వీసా, మాస్టర్‌కార్డ్ నెట్‌వర్క్‌లలోని ప్రీమియం క్రెడిట్ కార్డ్‌లకు మాత్రమే మద్దతు ఇవ్వనుంది. దీని ద్వారా ఐఫోన్ లేదా ఐప్యాడ్ వినియోగదారులు తమ క్రెడిట్ కార్డ్‌లను యాపిల్ వ్యాలెట్‌కు అనుసంధానించి, షాపుల్లోని స్వైపింగ్ మెషిన్ల (పీఓఎస్) వద్ద ఎన్‌ఎఫ్‌సీ (ఎన్‌ఎఫ్‌సీ) టెక్నాలజీతో కాంటాక్ట్‌లెస్ చెల్లింపులు చేయవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), స్పాన్సర్ బ్యాంకుల నుండి ప్రత్యేక అనుమతులు పొందాల్సి ఉన్నందున, ప్రారంభంలో యూపీఐ (యూపీఐ) సేవలు అందుబాటులో ఉండవని సమాచారం. ఈ నేపథ్యంలోనే దేశంలోని ప్రధాన కార్డు జారీ చేసే బ్యాంకులతో యాపిల్ చర్చలు జరుపుతున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ముఖ్యంగా, ప్రతి లావాదేవీపై 15--20 బేసిస్ పాయింట్ల ఫీజును యాపిల్ కోరుతున్నట్లు సమాచారం. అయితే కొన్ని బ్యాంకులు దీనిని 10 బేసిస్ పాయింట్లకు పరిమితం చేయాలని చూస్తున్నాయి. ఈ ఫీజును వినియోగదారులు లేదా వ్యాపారులపై నేరుగా వేయకుండా, బ్యాంకులు పొందే ఇంటర్‌ఛేంజ్ ఆదాయం నుంచి చెల్లించే విధానంపై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## గ్యాస్ సిలిండర్ ధరలు



ఈ నెల(ఆగస్టు) ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల పై కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తగ్గిన ఈ ధరలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి.

దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. ఇదిలా ఉంటే.. గత నెల(జులై)తో పోలిస్తే గృహ వినియోగ ఎల్‌పిజి ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**ఆగస్టు 11వ తేదీ నాటి గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50

## రష్యా ఆయిల్ దిగుమతుల్లో భారీ పెరుగుదల



సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) నివేదిక ప్రకారం, జూలై నెలలో భారత్ రష్యా నుండి రోజుకు రికార్డు స్థాయిలో 2.8 మిలియన్(28 లక్షల) బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంది. భారత్ దిగుమతి చేసుకునే మొత్తం చమురులో రష్యా వాటా ఏకంగా 55.5 శాతానికి చేరుకుంది. 2021లో కేవలం 2.5 శాతంగా ఉంటే, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత వేగంగా పెరిగి, ఇప్పుడు చైనా (50 శాతం) తర్వాత భారత్ (37 శాతం) ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రష్యన్ చమురు కొనుగోలుదారుగా నిలిపింది. జూలై ఒక్క నెలలోనే భారత్ 5.5 బిలియన్ యూరోల(రూ. 60.53 వేల కోట్ల) విలువైన రష్యన్ ముడి చమురును కొనుగోలు చేసింది. అమెరికా ఆంక్షలు, టారిఫ్ బెదిరింపులు ఉన్నప్పటికీ, ముంద్రా (58 శాతం పెరుగుదల), వడినార్ (35 శాతం ఎక్కువ), ముంబై వంటి చిన్న ఓడరేవుల ద్వారా దిగుమతులు భారీగా పెరగడంతో భారత్ ఈ రికార్డు స్థాయి చమురు నిల్వలను సాధించగలిగింది.

**పాశ్చాత్య దేశాలకే మళ్లీ ఎగుమతి**

రష్యా చమురు వాణిజ్యంలో భారత్ పాత్ర కేవలం ముడి చమురును కొనుగోలు చేయడంతోనే ఆగిపోలేదు. రష్యా నుండి తక్కువ ధరకు దిగుమతి చేసుకున్న ముడి చమురును జామ్‌నగర్ వంటి దిగ్గజ రిఫైనరీలలో శుద్ధి చేసి, తిరిగి రష్యాపై ఆంక్షలు విధించిన పాశ్చాత్య దేశాలకే భారత్ విక్రయిస్తోంది. జూలై నెలలో రష్యన్ చమురుతో తయారు చేసిన 284 మిలియన్ యూరోల విలువైన పెట్రోల్, డీజిల్ ఉత్పత్తులను యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా, స్వయంగా అమెరికాకు భారత రిఫైనరీలు ఎగుమతి చేశాయి. యూరప్ కూటమి నిషేధాలు, అమెరికన్ ఆంక్షల కంటిచూపు ఉన్నప్పటికీ, భారతీయ చమురు శుద్ధి ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్‌లో ఉన్న తీవ్ర డిమాండ్ కారణంగా భారత్ తన ఇంధన భద్రతను కాపాడుకుంటూనే అంతర్జాతీయ వాణిజ్యంలో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటోంది.



# చూపు తిప్పుకోలేం

మోస్ట్ హాటెస్ట్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఇప్పటివరకు పలు తెలుగు చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. కమర్షియల్ సినిమాల్లో తన అందాలతో యువతను ఆకట్టుకుంది.సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు గ్లామరస్ ఫొటోలను షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తోంది.దీంతో సోషల్ మీడియాలో ప్రగ్యా జైస్వాల్‌కు ఉన్న ఫాలోయింగ్ కూడా రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా ఈ బ్యూటీ మరోసారి తన గ్లామర్ ట్రీట్‌తో కుర్రకారును కట్టిపడేసింది.వైట్ కలర్ పొట్టి నిక్కర్‌కు మ్యాచింగ్ టీ షర్ట్ ధరించిన ప్రగ్యా.. సోఫాపై డిఫరెంట్ యాంగిల్స్‌లో కూర్చొని ఫొటోలకు పోజులిచ్చింది. తన గ్లామరస్ లుక్ హైలైట్ అయ్యేలా ఇచ్చిన ఈ స్టిల్స్‌లో ప్రగ్యా జైస్వాల్ మరింత హాట్‌గా కనిపించింది.దీంతో ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# చీరలో అదిరిపోయిన అమైరా దస్తూర్..




ప్రముఖ మోడల్, సినీ నటి అమైరా దస్తూర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. 1993 మే 7న ముంబైలో జన్మించిన ఆమె.. 2013లో విడుదలైన 'ఇస్సాక్' చిత్రంతో వెండితెరకు పరిచయం అయింది. ఆ తర్వాత హిందీతో పాటు తమిళం, తెలుగు, పంజాబీ భాషల్లోనూ సినిమాలు చేశారు.'మనసుకు నచ్చింది' చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆ చిత్రం తర్వాత ఈమెకు తెలుగులో సినిమా అవకాశాలు దక్కలేదు. దీంతో ప్రస్తుతం హిందీ, తమిళ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ అమైరా దస్తూర్ ఎప్పటికప్పుడు తన అందాలతో అభిమానులను ఆకట్టుకుంటూనే వస్తుంది.తాజాగా చీరలో దిగిన కొన్ని ఫొటోలను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. పర్పుల్, గోల్డ్ షేడ్స్‌తో కూడిన అందమైన చీరలో అమైరా ఎంతో ఆకర్షణీయంగా కనిపించారు. చీరకు తగ్గట్టుగా భారీ చెవిపోగులు, గాజులు ధరించి ట్రెడిషనల్ లుక్‌లో మెస్మరైజ్ చేశారు. ముఖ్యంగా కెమెరాకు వెనక్కి తిరిగి ఇచ్చిన పోజ్‌లో ఆమె బ్యాక్ లుక్ హైలైట్ కావడంతో ఈ ఫొటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పక్కకు తిరిగి కెమెరాను చూస్తూ అమైరా ఇచ్చిన పోజ్, ఆమె ఎక్స్‌ప్రెషన్స్ ఫొటోలకు మరింత గ్లామర్‌ను తీసుకొచ్చాయి. ట్రెడిషనల్ చీరకట్టులోనూ తన గ్లామర్‌తో ఆకట్టుకున్న ఈ బ్యూటీ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో అమైరా దస్తూర్ అందానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.


# మ్యూజికల్ జర్నీ షురూ..




మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త స్టైలిష్ యాక్షన్ స్పోర్ట్స్ థ్రిల్లర్ 'ఐయామ్ గేమ్'. నహాస్ హిదాయద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్, మైస్కిన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ స్వరాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 20న ఓణం పండుగ సందర్భంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇక సినిమా విడుదల టైమ్ దగ్గర పడటంతో.. తాజాగా మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేశారు. ఇందులోని మొదటి పాట 'ఎవరే నువ్వే నాకేమవుతావే'ను విడుదల చేశారు. ఈ పాటలో దుల్కర్ సల్మాన్, కాయదు లోహర్ మధ్య చూపించిన అనురాగం, వారి సైగలు ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. "ప్రతి కాలంలోనూ ఆ రంగులంటే చాలా ఇష్టం" అనే క్యాప్షన్‌ను జత చేసి ఈ పాటను వదిలారు.

యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. తాజాగా ఆయన నటిస్తున్న కొత్త చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మెరుపులు, భారీ కొండలు, యాక్షన్ అంశాలను ప్రతిబింబించేలా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. దీంతో సినిమాపై ఆసక్తి నెలకొంది. 'ఇంద్రపుత్ర' చిత్రానికి శ్రీకాంత్ పుప్పల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్నారు. కీర్తన్ కథ అందించగా.. తాన్వీ ఎన్. దత్తా రచన చేస్తున్నారు. కీర్తన్, కుసుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మాతలుగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కిరణ్ అబ్బవరం నటిస్తున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కాగా, 'ఇంద్రపుత్ర'ను 2027లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

# టైటిల్.. ఫస్ట్ లుక్ రిలీజ్




# కొత్త కథలు ఉంటే, అన్నపూర్ణ స్టూడియోకు రండి



కొత్తవాళ్లు దర్శకులుగా మారే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు అదిరిపోయే ప్రకటన చేశారు అక్కినేని నాగార్జున. మంచి కథ ఉంటే అన్నపూర్ణ స్టూడియోకు ఎవరైనా రావచ్చని వెల్లడించారు. పళ్ళ బురుసు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ సందర్భంగా అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడారు. కొత్త కథలతో ఎవరైనా వస్తే, అన్నపూర్ణ స్టూడియో సినిమా నిర్మించడానికి రెడీగా ఉంటుందని ప్రకటన చేశారు.తమ స్టూడియోస్ బ్యానర్ పై చాలా సినిమాలు చేసినట్లు గుర్తు చేశారు. ఇకపై మరింత వేగంగా.. కొత్త వాళ్లకు అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. స్టూడియో అంటే లీజుకు ఇచ్చి డబ్బులు సంపాదించడమే కాదని.. తిరిగి ఇండస్ట్రీకి ఇవ్వాలని ఈ సినిమాలు స్టార్ట్ చేశామని ప్రకటించారు. ఇటీవల లెనిన్ తో హిట్ కొట్టాం.. ఇప్పుడు పళ్ళ బురుసు రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు.రాబోయే రోజుల్లో రంభ, ఊర్వశి, మేనక సినిమాను రిలీజ్ చేయబోతున్నట్లు కూడా ప్రకటన చేశారు. ఆ తర్వాత తన కింగ్ 100 సినిమాలు కూడా రిలీజ్ చేయనున్నట్లు వివరించారు. ఇది ఇలా ఉండగా గోమతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా కాంబినేషన్ లో వస్తున్న లేటెస్ట్ మూవీ పళ్ళ బురుసు. ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ కలిసి నిర్మించాయి. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించారు. ఆగస్టు 14వ తేదీన రిలీజ్ కానుంది.




# విడుదలకు సిద్ధమైన యాక్షన్ థ్రిల్లర్..

బాలీవుడ్ స్టార్స్ సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ నటిస్తున్న అంతర్జాతీయ బిగ్ యాక్షన్ థ్రిల్లర్ '7 డాగ్స్' భారతీయ థియేటర్లలోకి రావడానికి డేట్ లాక్ చేసుకుంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ఇండియా వ్యాప్తంగా హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈజిప్షియన్ సూపర్‌స్టార్లు అహ్మద్ ఎజ్, కరీమ్ అబ్దెల్ అజీజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ స్పెషల్ కామియో రోల్స్‌లో అలరించనున్నారు. వీరితో పాటు హాలీవుడ్ నటి మోనికా బెల్లూచీ, ప్రముఖ నటుడు జియాన్‌కార్లో ఎస్పోసిటో కీలక పాత్రలు పోషించారు. 'బ్యాడ్ బాయ్స్ ఫర్ లైఫ్', 'బ్యాడ్ బాయ్స్: రైడ్ ఆర్ డై' వంటి బ్లాక్‌బస్టర్ యాక్షన్ చిత్రాలను అందించిన హాలీవుడ్ దర్శకుల జంట ఆదిల్ ఎల్ అర్బీ, బిలాల్ ఫల్లా ఈ సినిమాను తెరకెక్కించారు. సేలా స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సౌదీ అరేబియా జనరల్ ఎంటర్‌టైన్‌మెంట్ అథారిటీ, రియాద్ సీజన్ ప్రత్యేక మద్దతు అందించాయి.




# రెండేళ్లుగా ప్రేమలో ఉన్నా..

తమిళ, తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న యంగ్ బ్యూటీ దుషారా విజయన్, ప్రస్తుతం 'మగుడం', 'సార్పట్టా-2' వంటి వరుస ప్రాజెక్ట్‌లతో దక్షిణాదిలో అత్యంత బిజీ హీరోయిన్‌గా మారారు. నటనతోనే కాకుండా తన సహజ సిద్ధమైన శైలితో ఆకట్టుకునే ఈ భామ, తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత లైఫ్ గురించి మాట్లాడుతూ ఊహించని విశేషాలను పంచుకున్నారు. తాను గత రెండేళ్లుగా ఒక మంచి వ్యక్తితో ప్రేమ ప్రయాణంలో ఉన్నానని, ప్రస్తుతం తన లైఫ్ చాలా హ్యాపీగా సాగుతోందని ఓపెన్‌గా వెల్లడించారు. అయితే ప్రస్తుతానికి పెళ్లి చేసుకునే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. తాను చిత్రపరిశ్రమలో స్థానం సంపాదించుకోవడానికి పడ్డ కష్టాన్ని దగ్గరుండి చూసిన తన తల్లిదండ్రులు, పెళ్లి విషయంలో తనపై ఎలాంటి ఒత్తిడి తేవడం లేదని చెప్పారు.తన ప్రియుడు కూడా తన వృత్తిని, కెరీర్‌ను ఎంతగానో గౌరవిస్తూ నిరంతరం ప్రోత్సహిస్తారని, అలాంటి వ్యక్తి దొరకడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. ఒక బంధంలో పరస్పర నమ్మకం, గౌరవం మాత్రమే అత్యంత కీలకమని భావించే దుషారా, తమ ప్రేమకథ ప్రారంభమైన విధానాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. తమద్దరికీ ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టమని, వారి మొదటి కలయిక దుబాయ్‌లో జరిగిందని చెప్పారు. తన తండ్రి స్నేహితుడి ద్వారా పరిచయమైన క్రమంలో.. ఆయనతో కలిసి కారులో వెళ్తున్నప్పుడు తనకిష్టమైన ఇళయరాజా పాట ప్లే కావడంతో ఆశ్చర్యపోయానని తెలిపారు. నిజానికి తమ ఇద్దరి మనసులను కలిపిన మొదటి అంశం ఇళయరాజా సంగీతమేనని దుషారా మురిసిపోతూ చెప్పుకొచ్చారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**